


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 337 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 7 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :337 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 7 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## బొండా ఉమా రౌడీలను పోగేసి దాడికి పాల్పడ్డారు



- వైసీపీ దీక్షా శిబిరంపై అధికారమదంతో బొండా ఉమా దాడి చేశారన్న పేర్ని నాని
- ఇలాంటి దాడులు రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చలా మిగిలిపోతాయని వ్యాఖ్య
- ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్న పేర్ని నాని

పెన్ పవర్ డెస్క్:విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ చేపట్టిన నిరాహార దీక్షా శిబిరంపై టీడీపీ శ్రేణులు దాడి చేసి టెంట్‌ను తొలగించారంటూ మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమా అధికారమదంతో రౌడీలను పోగేసి ఈ దాడికి పాల్పడ్డారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీ జరుపుతున్న ఇటువంటి దాడులు ఒక మాయని మచ్చగా మిగిలిపోతాయని విమర్శించారు. బొండా ఉమా

- మిగతా 2లో

## పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

### జగన్‌పై మంత్రి అనిత విమర్శలు



- పరామర్శల పేరుతో బలప్రదర్శన చేస్తున్నారని ఆరోపణ
- నిందితులను పరామర్శిస్తున్నారని విమర్శ
- జగన్ పర్యటనల వీడియోలు ప్రదర్శించిన అనిత
- అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదని వైకాపాపై ఆరోపణ
- పరామర్శల వల్ల ముగ్గురు చనిపోయారని ఆరోపణ
- ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్న

- మిగతా 2లో

## చంద్రబాబు, లోకేశ్ జోలికొస్తే తోలు తీస్తాం

### వైసీపీ నేతలకు బొండా ఉమా తీవ్ర హెచ్చరిక

- విజయవాడలో వైసీపీ నేతల దీక్షపై బొండా ఉమా ఫైర్
- డీఎస్సీపై చర్చకు రమ్మంటే పారిపోయారని ఎద్దేవా
- వెల్లంపల్లి ఎక్కడ కనిపిస్తే అక్కడ కట్టేస్తామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతలు చేపట్టిన నిరాహార దీక్ష వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఘాటుగా స్పందించారు. డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడంపై మండిపడిన ఆయన... అసలు అక్రమాలపై చర్చకు రమ్మంటే వైసీపీ నేతలు పారిపోయారని ఎద్దేవా చేశారు. పోలీసుల అనుమతి లేకుండా రోడ్డుపై కూర్చుని చంద్రబాబు, లోకేశ్‌లను బూతులు తిడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "శాంతియుతంగా నిరసన

- మిగతా 2లో



## ఎన్నికలకు సిద్ధంకండి..

### ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు ఉండండి: మంత్రులకు నారా లోకేశ్ సూచన

- స్థానిక ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయన్న నారా లోకేశ్
- భారీ విజయం లక్ష్యంతో క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచన
- ఎల్-నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలపై తన సహచర మంత్రులకు నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. స్థానిక పోరు

- మిగతా 2లో

## వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టడానికి రెండు నిమిషాలు చాలు

### కేబినెట్ భేటీలో చంద్రబాబు

- రాజకీయం ముసుగులో జగన్ నేరాలకు పాల్పడుతున్నారన్న చంద్రబాబు
- డీఎస్సీపై వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శ
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కూటమి శ్రేణులకు పిలుపు



పెన్ పవర్ డెస్క్:రాజకీయం ముసుగులో మాజీ సీఎం జగన్ తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారని, వైసీపీ నేతల అరాచకాలకు చెక్ పెట్టడానికి తమకు కేవలం రెండు నిమిషాలు చాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఘాటుగా హెచ్చరించారు. అమరావతి సచివాల యంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ ప్రక్రియపై కోర్టు చివాట్లు పెట్టినా పట్టించుకోకుండా వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తూ రాద్ధాంతం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ వ్యవహారంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని, తప్పుడు ఆరోపణలను క్షేత్రస్థాయిలో గట్టిగా తిప్పికొట్టాలని టీడీపీ నేతలు, శ్రేణులకు సీఎం సూచించారు. జగన్ ఎక్కడైనా పరామర్శలకు వస్తున్నారంటేనే అసలు ఏం జరుగుతుందోనని జనాలు భయపడే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు.

## చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక.. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

- 'నేతన్న సేవలో' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల సాయం
- చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చేతుల మీదుగా పథకం ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్ల ప్రయోజనం
- ఉచిత విద్యుత్, 50 ఏళ్లకే పింఛన్లతో పాటు పలు సంక్షేమ పథకాల అమలు
- చీరాల పర్యటనలో నేతన్నలతో ముఖాముఖి భేటీ కానున్న సీఎం చంద్రబాబు



- మిగతా 2లో



### డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్..

## విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు

- విశాఖపై పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- నైట్ ఫ్రాంక్ నివేదికలో ముంబయికి ప్రపంచ టాప్-15లో చోటు
- హైదరాబాద్‌కు భారీ ప్రాజెక్టుల వరుస
- విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల అవకాశాలు
- క్లౌడ్, ఏఐతో పెరుగుతున్న డిమాండ్
- భారత్‌కు బలపడుతున్న గ్లోబల్ గుర్తింపు

- మిగతా 2లో

## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి

- పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్రం
- ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం
- ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు
- పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం
- సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరని సూచన
- వివాదాల తర్వాతే కొత్త దరఖాస్తు పంపాలని హితవు

- మిగతా 2లో



## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

- పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్
- సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం
- సీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర
- కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం
- గ్రామీణ ఉపాధి, పెట్టుబడులకు ఊతం

- మిగతా 2లో





### హైదరాబాద్ వాసులకు చల్లని కబురు..

## శనివారం వరకు వర్షాలు

- హైదరాబాద్‌లో శనివారం వరకు ఉరుములతో కూడిన వర్షాలు
- ప్రస్తుతం 12 శాతంగా ఉన్న వర్షపాతం లోటు తగ్గే అవకాశం
- తెలంగాణ వ్యాప్తంగా సాధారణ స్థాయిలోనే వర్షపాతం నమోదు
- కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా అదనపు వర్షపాతం

- మిగతా 2లో

## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- యూపీఐ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్
- యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం
- ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు
- పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం
- సాధారణ వినియోగదారులకు ప్రభావం ఉండదని సంకేతాలు

- మిగతా 2లో



పెన్ పవర్ డెస్క్:డిజిటల్ చెల్లింపులకు సంబంధించి కీలక మార్పులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు–2026'ను లోక్‌సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు పాస్ అయింది. ప్రస్తుతం



## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. 3 గంటల్లో తొలగించాల్సిందే

- డీప్‌ఫేక్‌లపై కేంద్రం కఠిన నిబంధనలు
- సున్నితమైన ఫిర్యాదుల పరిష్కారానికి 2 గంటలే
- ఏఐ కంటెంట్‌కు గుర్తింపు వివరాలు తప్పనిసరి
- ఆటోమేటెడ్ వ్యవస్థలతో పర్యవేక్షణ
- డీప్‌ఫేక్ గుర్తింపునకు ఐఐటీల సాంకేతికత
- ఫిర్యాదుల కోసం అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్

పెన్ పవర్ డెస్క్:సోషల్ మీడియాలో కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు, ఫొటోలకు అడ్డుకట్ట వేసేందుకు

- మిగతా 2లో

## కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం.. దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

- సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?' ప్రచారం
- దేశవ్యాప్తంగా ప్రజలతో నేరుగా సంభాషణ
- విద్య వ్యాణిజ్యీకరణపై సీజేపీ విమర్శలు
- ఫీజుల భారం తగ్గించాలని డిమాండ్
- నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా ప్రస్తావన
- ఎన్నికలకు దూరంగా ఉంటామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:జంతర్‌మంతర్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌లపై చేపట్టిన ఆందోళనల తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయించింది. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?'

- మిగతా 2లో




## జనం వచ్చారని గెలిచినట్లేనా? ఎత్తుగడలు ఎక్కడ?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

**బయటకు వస్తే చాలు...**

గత పధ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేననన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

**చేయాల్సిందిదీ...**

జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు.

## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. 3 గంటల్లో తొలగించాల్సిందే

- మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్రమ కంటెంట్‌పై ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే తొలగించాలని మధ్యవర్తి వేదికలకు (ఇంటర్మీడియరీలు) ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ గడువు 36 గంటలు ఉండేది. లోక్‌సభలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఈ వివరాలు వెల్లడించారు. డీప్‌ఫేక్‌లు, ఏఐతో రూపొందించిన తప్పుడు సమాచారం పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ నిబంధనలను బలోపేతం చేసినట్లు చెప్పారు.నగ్న చిత్రాలు, వ్యక్తుల వేషధారణను అనుకరించడం, అశ్లీల కంటెంట్ వంటి సున్నితమైన అంశాలపై వచ్చే ఫిర్యాదులను ఇకపై రెండు గంటల్లోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. గతంలో ఇందుకు 24 గంటల గడువు ఉండేది.ఏఐతో రూపొందించిన కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపు, సోర్స్ వివరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. దీంతో వినియోగదారులు అది నిజమైనదా, కృత్రిమంగా రూపొందించిందా అనేది సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.చట్టాలను ఉల్లంఘించే డీప్‌ఫేక్ కంటెంట్ తయారీ, ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఆటోమేటెడ్ సాంకేతిక వ్యవస్థలను వినియోగించాలని కూడా సూచించింది. బాలల లైంగిక దోపిడీ, అనుమతి లేకుండా వ్యక్తిగత చిత్రాల ప్రచారం, వేషధారణ మోసాల వంటి కంటెంట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.డీప్‌ఫేక్‌లను గుర్తించేందుకు ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసిన ప్రత్యేక వ్యవస్థలను కూడా కేంద్రం ప్రస్తావించింది. అలాగే ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అధికారుల నియామకం, కేంద్ర స్థాయిలో అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

# చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక.. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి వృత్తిని పరిరక్షించేందుకు ప్రజా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే లక్ష్యంతో 'నేతన్న సేవలో' అనే సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా చీరాలలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందనుంది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు మొత్తం రూ.179 కోట్లు జమ కానున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వనప్పటికీ, చేనేత వృత్తిని, దాని వారసత్వాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని అమలు చేస్తోంది.ఈ కొత్త పథకంతో పాటు ఇప్పటికే ప్రభుత్వం చేనేత రంగానికి అనేక విధాలుగా మద్దతు అందిస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోంది. దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం చేకూరుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.150 కోట్లు వెచ్చిస్తోంది. అంతేకాకుండా, చేనేతల వృద్ధాప్య పింఛన్ వయసును 50 ఏళ్లకు తగ్గించి, రాష్ట్రవ్యాప్తంగా 85 వేల మందికి నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ల కోసం ఏటా రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ భరోసా వారి జీవనోపాధికి అండగా నిలుస్తోంది.చేనేత రంగాన్ని మౌలికంగా బలోపేతం చేసేందుకు కూడా ప్రభుత్వం దీర్ఘకాలిక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, రాజధాని అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల భారీ పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటం ఈ రంగ అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఈ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు చీరాలలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, వేటపాలెం మండలం

కొత్తపేటకు చేరుకుంటారు. ఉదయం 11:05 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:35 గంటలకు జాండ్రపేటలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో నేతన్నలతో ముఖాముఖి నిర్వహిస్తారు. సాయంత్రం 4:10 గంటలకు కొత్తపేటలో టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశంలో పాల్గొని, తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

## పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శల పేరిట బలప్రదర్శన చేస్తున్నారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. ఆయన బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. బాధితులను కాకుండా నిందితులను పరామర్శించడం ఏంటని జగన్‌ను నిలదీశారు. ఆయన పర్యటనల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వీడియోలను మీడియాకు ప్రదర్శించారు."వైకాపా నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. బెట్టింగ్‌లో నష్టపోయి మృతి చెందిన వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారు. ఆయన కారు కింద ఓ వ్యక్తి పడినా పట్టించుకోకుండా వెళ్లిపోయారు.

అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా వైకాపా కార్యకర్తలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పరామర్శల సమయంలో మహిళలపై కూడా దాడులు జరుగుతున్నాయి. పోలీసులను బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు" అని ఆరోపించారు.పరామర్శల పేరుతో నిర్వహిస్తున్న బలప్రదర్శనల వల్ల ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అనిత అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని అయినా జరిగిందా అని జగన్‌ను ప్రశ్నించారు.

## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు.

కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది.ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర

వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది.

రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

## హైదరాబాద్ వాసులకు చల్లని కబురు.. శనివారం వరకు వర్షాలు

హైదరాబాద్‌వాసులకు భారత వాతావరణ శాఖ ఊరటనిచ్చే వార్త అందించింది. శనివారం వరకు హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలుల వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వర్షాలతో నగరంలో ప్రస్తుతం నెలకొన్న వర్షపాతం లోటు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు హైదరాబాద్‌లో సాధారణంగా 313.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ, కేవలం 277.3 మి.మీ. మేర మాత్రమే కురిసింది. దీనివల్ల సుమారు 12 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. రాబోయే వర్షాలతో ఈ లోటు భర్తీ కావడంతో పాటు, రాష్ట్రంలోని జలాశయాల నీటి మట్టాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం దాదాపు సాధారణ స్థితిలోనే ఉంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 402.1 మి.మీ. కాగా, ఇప్పటివరకు 379 మి.మీ. నమోదైంది. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 581 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక్కడ సాధారణ వర్షపాతం 442.6 మి.మీ. మాత్రమే. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి.రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన తాజా బులెటిన్‌లో పేర్కొంది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేశారు.

## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్‌ధన్' పథకం

వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్‌ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది.2026-27 నుంచి 2035-36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి.సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది.

కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది.సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

## కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం.. దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

- మొదటి పేజీ తరువాయి

పేరుతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ప్రకటించారు.ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ కోర్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత దిప్కే మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని దిప్కే విమర్శించారు. మొదటి తరగతి ప్రవేశానికే రూ.లక్షల ఫీజులు, భారీ విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యతరగతి, ఉద్యోగ కుటుంబాలు పిల్లలను చదివించడం భారంగా మారిందన్నారు. ఉన్నత విద్య, కోచింగ్ పేరుతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, అది అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నీట్ అక్రమాలపై జరిగిన ఆందోళనల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని దిప్కే గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం కూడా అత్యంత కీలక సమస్యగా మారిందన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వతంత్ర పాత్రను మీడియా పోషించాలని కోరారు.సీజేపీ ఎన్నికల్లో పోటీ చేయదని, ప్రజల హక్కుల పరిరక్షణ, పాలనలో సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చే శక్తిగా పనిచేస్తుందని దిప్కే స్పష్టం చేశారు.

## బోండా ఉమా రౌడీలను పోగేసి దాడికి పాల్పడ్డారు

- మొదటి పేజీ తరువాయి

వంటి రౌడీలను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శునకానందం పొందుతున్నారని, అయితే ఈ ఆనందం ఎంతో కాలం నిలవదని పేర్ని నాని మండిపడ్డారు. శిశుపాలుడి పాపాలు పండినట్లే చంద్రబాబు ప్రభుత్వ పాపాలను కూడా ప్రజలు లెక్కిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. "చంద్రబాబును ఏమైనా అంటే ఇళ్లకు వచ్చి కొడతామని బెదిరిస్తున్నారు. మీ చేతనైంది చేసుకోండి, ఎంతమందిని కొడతారో మేమూ చూస్తాం" అంటూ సవాల్ విసిరారు.

## చంద్రబాబు, లోకేశ్ జోలికొస్తే తోలు తీస్తాం

- మొదటి పేజీ తరువాయి

తెలపాలనుకుంటే ధర్నా చౌక్‌లో చేసుకోవాలి. అంతేకానీ రోడ్డుపై కూర్చుని మా నాయకులపై దాడి చేస్తామంటే చూస్తూ ఊరుకోం. తోలుతీస్తాం. వెల్లంపల్లి శ్రీనివాస్ ఎక్కడ కనిపిస్తే అక్కడ కట్టేస్తాం" అని హెచ్చరించారు. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే ఇకపై సహించేది లేదని, ప్రతిఘటన తప్పదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్.. విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు

భారత్ డేటా సెంటర్ రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. విశాఖపట్నం భారీ స్థాయి కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆకర్షణీయ గమ్యంగా మారుతోంది. ఈ విషయాలు నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడయ్యాయి.ప్రపంచంలోని 36 ప్రధాన డేటా సెంటర్ మార్కెట్లపై నిర్వహించిన అధ్యయనంలో ముంబయి ఆపరేషనల్ సామర్థ్యం పరంగా 15వ స్థానంలో నిలిచింది. అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితాలో 11వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ ప్రస్తుతం 151 మెగావాట్ల సామర్థ్యంతో 27వ స్థానంలో ఉన్నా, 2.2 గిగావాట్లకు పైగా అభివృద్ధి ప్రణాళికలతో 19వ స్థానంలో నిలిచి వేగంగా విస్తరిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది.చెన్నై ఆగ్నేయాసియా ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు కీలక కేంద్రంగా బలపడుతుండగా, బెంగళూరు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన సంస్థల పెట్టుబడులను ఆకర్షిస్తోంది.మరోవైపు పుణె, ఢిల్లీ ఎన్‌సీటీ ప్రాంతంలో కూడా డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతోంది. రెండో శ్రేణి నగరాల్లో విశాఖపట్నం, జామ్‌నగర్ భారీ గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీ ప్రణాళికలు ఇందుకు దోహదపడుతున్నాయని వెల్లడించింది.క్లౌడ్ సేవల వినియోగం పెరగడం, కృత్రిమ మేధ వినియోగం విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడం వల్ల భారత్‌లో డేటా సెంటర్లకు డిమాండ్ మరింత పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ ఇండియా అభిప్రాయపడింది. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన అనుమతులు ఉంటే రానున్న దశాబ్దంలో భారత్ ప్రపంచంలోనే కీలక డేటా సెంటర్ల కేంద్రంగా ఎదిగే అవకాశముందని పేర్కొంది.

## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- మొదటి పేజీ తరువాయి

యూపీఐ సహా కొన్ని డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వసూలు చేయకుండా చట్టపరమైన నిబంధన ఉంది. తాజా సవరణతో ఆ నిబంధన తొలగనుంది. దీంతో భవిష్యత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఏర్పడింది.ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపై సేవా రుసుములు అమల్లో ఉండగా, యూపీఐకి మాత్రం మినహాయింపు ఉంది. కొత్త బిల్లుతో ఆ పరిస్థితి మారనుంది.అయితే ఈ ఛార్జీలు సాధారణ వినియోగదారులపై కాదు. నిర్దిష్ట పరిమితికి మించిన యూపీఐ లావాదేవీలు చేసే పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలకే వర్తించే అవకాశం ఉందని సమాచారం. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, మౌలిక సదుపాయాల సంస్థలకు ఆదాయం సమకూర్చడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.

ఛార్జీల శాతం, ఏ స్థాయి లావాదేవీలకు వర్తిస్తాయనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తర్వాత స్పష్టత ఇవ్వనున్నాయి.

## ఎన్నికలకు సిద్ధంకండి..

- మొదటి పేజీ తరువాయి

అనుకున్న సమయానికే జరుగుతుందని స్పష్టం చేసిన లోకేశ్, కూటమి అభ్యర్థుల భారీ విజయానికి పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయికి వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా నాయకులు ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలైనా గడిపి, వైసీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని, కూటమి ప్రభుత్వం తెచ్చిన సంక్షేమాన్ని క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఈ ఉదయం మంత్రులతో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు సూచించారు.ఇదే సమావేశంలో అసెంబ్లీ వ్యూహంపైనా చర్చించారు. రాష్ట్రంలో ఉన్న ఎల్-నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. జలాశయాల్లోకి నీరు చేరుతుండటం కొంత ఊరటనిచ్చినప్పటికీ... ప్రభుత్వం వైపు నుంచి తొలి ప్రాధాన్యత తాగునీటి సరఫరాకే ఇవ్వాలని, ఆ తర్వాత పశుగ్రాస కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభను సరైన వేదికగా మలుచుకోవాలని మంత్రులకు పిలుపునిచ్చారు.

# మినరల్ మాయా 'జలం'

## పుట్టగొడుగుల్లా పుట్టిన వాటర్ ప్లాంట్లు

## ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ ఉందో లేదో తెలియదు.. 80శాతం అక్రమ ప్లాంట్లే

## గ్రామ గ్రామానా ఇదే పరిస్థితి..-ఆటోతో గొంది గొందికి సప్లై

## గ్యాస్ట్రో, మలేరియా ఒంటి వ్యాధులు సోకే అవకాశం

## నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లు..పట్టించుకోని అధికారులు



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 6**

కనీస శుభ్రత కూడా లేని నీటిని తాగితే ఏ రోగాలు వస్తాయో తెలియని దుస్థితి.నిజానికి మనం కలుషితాలు ఉండవని ఆరోగ్యం కోసం మినరల్ వాటర్ ప్లాంట్ నుండి వాటి కొనుక్కొని తాగుతున్నాం. నిజానికి డబ్బులు ఇచ్చి మరి మనం అనారోగ్యాన్ని కొనుక్కుంటున్నాం.మార్కాపురం, కనిగిరి,గిద్దలూరు, యర్రగొండపాలెం పట్టణాలతో పాటు గ్రామ గ్రామానా అనధికారిక మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అనుభవం లేదు, అనుమతులు లేవు, కానీ లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ ఉందో లేదో తెలియదు.. జిల్లాలో 120కి పైగా ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో 80 శాతం ప్లాంట్లకు ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్, మున్సిపల్ లైసెన్స్, పొల్యూషన్ అనుమతి ఏమీ లేదు. రూ.3 లక్షలతో మిషన్ కొని, నెలకు లక్షలు సంపాదించాలని ఎవరి పడితే వారు ఈ వ్యాపారంలోకి దిగుతున్నారు. ప్లాంట్ మీద ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ నంబర్ ఉందా లేదా అని అడిగే వారే లేరు.

**ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం..**

మినరల్ ప్లాంట్ల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమడుతున్నారు. టీడీఎస్ ఎక్కువ ఉందనే సాకుతో అలమ్, క్లోరిన్, బ్లీచింగ్ పౌడర్, ఇతర రసాయనాలు విచ్చలవిడిగా కలుపుతున్నారు. నెలకు ఒకసారి మార్చాల్సిన ఫిల్టర్ 6 నెలలు, ఏడదైనా ఒకసారి మార్చడం లేదని తెలుస్తుంది. ఆర్.ఓ మెంబ్రేన్ నల్లగా మారినా కూడా నీరు తీస్తున్నారు. 20 రూపాయల లాభం కోసం ప్రజల కిడ్నీలు, కడుపులతో ఆడుకుంటున్నారు. దీనివల్ల కిడ్నీ స్టోన్స్, చర్మ వ్యాధులు, కడుపు నొప్పులు సర్వసాధారణం అయ్యాయి.

**ఆటోతో గొంది గొందికి తిరిగి సప్లై..**

ఆటోలలో డ్రమ్ములతో 20 లీటర్ల క్యాన్లను గొంది గొంది తిప్పి సప్లై చేస్తున్నారు. ఆ క్యాన్లు, ట్యాంకులు ఎప్పుడు శుభ్రం చేస్తున్నారు? ఏమైనా కడుగుతున్నారా? అనేది అంతుచిక్కని ప్రశ్న. వీధిలోకి ఆటో వస్తుంది అందరూ డబ్బులు ఇచ్చి వాటర్ పట్టుకుంటున్నారు. అవి మంచివా, చెడ్డవా అనేది ఆలోచన లేదు.

**బార్, హోటల్, హాస్పిటల్.. అందరికీ ఒకే నీరు..**

ఇళ్లకు మాత్రమే కాదు. బార్లల్లో, హోటల్స్ లో వంటకు, తాగడానికి, హాస్పిటల్స్ లో రోగులకు కూడా ఇదే నీరు పోస్తున్నారు. అతిపెద్ద ప్రశ్న ఏంటంటే అక్కడ ఏర్పాటు చేసిన కూలింగ్ బాక్స్ లు కడుగుతున్నారా? అనేదానికి సమాధానం లేదు. సంవత్సరాల తరబడి ఒకే బాక్స్ వాడుతున్నారు. హాస్పిటల్ లో రోగికి ఇచ్చే నీరు ఇలా ఉంటే పరిస్థితి ఏమిటి?

**డాక్టర్ల హెచ్చరిక..:** కలుషిత నీరు తాగడం వలన రోగాల బారిన పడాల్సిన పరిస్థితి ఉంటుంది.. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు జాగ్రత్తగా ఉండాలి. సీల్ ఉన్న బాటిల్ వాటర్ మాత్రమే వాడాలి. లూజ్ వాటర్, ఆటో క్యాన్ వాటర్ అస్సలు తాగవద్దు. నీటికి వాసన, రంగు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి అని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఇది.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# అమ్మో ..దోమకాటు..!

## దోమలతో జనం బేజారు

## దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టండి

## ప్రజల అవసరాలను గుర్తించండి

## సాయంత్రం వేల దోమల ఉధృతి అధికంగా ఉంది

## పంచాయతీ అధికారులు శ్రద్ధ చూపండి

## ప్రజల పట్ల జాలి దయ చూపండి

## మురికి కాల్వల పై ప్రత్యేక శ్రద్ధ చూపండి



**పెన్ పవర్, కంభం ఆగస్టు 6**

దోమలు ..బాబోయ్ దోమలు సాయంత్రం 6 దాటితే ప్రజలు నరకం చూస్తున్నారు. కనీసం ఫాగింగ్ అయిన చేయండి. ప్రజల అవసరాలు గుర్తించండి శుభ్రత.. పరిశుభ్రత ఎక్కడ. మురికి కాలువలు తాండవం చేస్తున్నాయి. కంభం కందులాపురం ప్రాంతాలలో దోమల బెడద పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఫాగింగ్ నిర్వహించడమే కాక పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు . మేజర్ పంచాయతీలు అయినప్పటికీ సాయంత్రం 6 గంటల అనంతరం దోమల ప్రతాపం చూపిస్తున్నాయి .దోమల ఉధృతి వలన ప్రజలు అనారోగ్యం బారిన పడకముందే జాగ్రత్త గా ఫాగింగ్ యంత్రాలు తెప్పించి ప్రతి వార్డులో ఫాగింగ్ నిర్వహించాలి . గ్రామంలో మురికి కాలువల పరిస్థితి పరిశీలించి అక్కడ ఎక్కువగా ఫాగింగ్ యంత్రాలతో దోమల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాలి . దోమల నివారణ కు ప్రతి కుటుంబ సభ్యులు వారి ఇంటి వద్ద మురికి నీరు లేకుండా చూడాలని కోరారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలి. పంచాయతీ సిబ్బంది సహకారంతో పనులు చేపట్టాలని అనేక మంది కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితుల వలన డ్రైనేజీ వలన దోమలు బెడద విపరీతంగా ఉంది. వీటిపై ఆయా పంచాయతీల వారు దృష్టిపెట్టాలని ప్రజల అవసరాలను కూడా గుర్తించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మెగా డీఎస్సి అక్రమాలపై వైసీపీ రిలే నిరాహార దీక్ష

## లోకేష్ రాజీనామా చేయాలి

### సిబిఐ విచారణ జరిపించాలి- అన్న రాంబాబు

### నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 6**

మెగా డీఎస్సీ పేపర్ లీక్, అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు.మొదటి రోజు నిరసన కార్యక్రమంలో మార్కాపురం మండలం, పొదిలి టౌన్ కి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటుందన్నారు. మెగా డీఎస్సీ పేపర్ లీక్ అయి లక్షల మంది నిరుద్యోగుల కలలు నాశనమయ్యాయని ,దీనికి పూర్తి బాధ్యత మంత్రి నారా లోకేష్ దే అని అన్నారు. వెంటనే ఆయన రాజీనామా చేసి, ఈ అక్రమాలపై సి.బి.ఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.యువతకు ఇచ్చిన హామీలను ఏమయ్యాయి అంటూ ప్రశ్నించారు.ఎన్నికల ముందు ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. అది ఏమైంది? లక్షలాది మంది విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదు? కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్న హనుమారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. పేపర్ లీక్ చేసి యువత ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసారని ఆవేదనను వ్యక్తం చేశారు. మా పోరాటం ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆగదుఅన్నారు. మొదటిరోజు దీక్షలో పాల్గొన్న నాయకులకు అన్నా రాంబాబు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. నుంచి ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ మున్సిపల్ మాజీ చైర్మన్ చలంచర్ల బాలమురళీకృష్ణ, జడ్పిటిసి నారు బాపన్ రెడ్డి, కోటిరెడ్డి, చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, 18 బ్లాక్ ఇన్చార్జి సయ్యద్ గఫూర్, విద్యార్థి విభాగం నాయకులు అంజిరెడ్డి, గౌస్ మొహిద్దిన్, టౌన్ సోషల్ మీడియా అధ్యక్షులు రఫీ, ఆయుబ్, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నాయకులు, యువత పాలుగున్నారు.



# నిధులపై ఉన్న శ్రద్ధ... గిరిజనుల దాహం పై లేదా..?

## అక్కపాలెం తాండాలో తారస్థాయికి తాగునీటి సమస్య

### డీప్ బోరు వేసినా తీరని గిరిజనుల దాహం...

**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్టు 6**

పుల్లల చెరువు మండలంలోని అక్కపాలెం తాండాలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. మండల పరిషత్ నిధులతో కూటమికి చెందిన ఓ నాయకుడు డీప్ బోరు వేయించినప్పటికీ, అది గిరిజనుల దాహాన్ని తీర్చలేకపోయిందని తాండా వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పనులు చేయాల్సిన ప్రజాప్రతినిధులు, నిధులను ఎలా దోచుకోవాలన్న దానిపైనే దృష్టి పెట్టారని, కానీ గిరిజనుల మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న ఆలోచన చేయలేదని వారు ఆరోపిస్తున్నారు. తాండాలో తాగునీటి కోసం ప్రతిరోజూ మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.మండల పరిషత్ నిధులతో వేసిన డీప్ బోరు కొద్దిసేపు మాత్రమే నీరు ఇచ్చి వెంటనే ఆగిపోతుండడంతో తాండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరుకు సమీపంలో ఉన్న కొన్ని కుటుంబాలకు మాత్రమే నీరు అందుతుండగా, మిగిలిన కుటుంబాలు తాగునీటి కోసం పొలాల్లోని బోర్లు, ఇతర ప్రాంతాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని వారు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచి నీటిని మోసుకురావాల్సి వస్తోందని, వేసవి కాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తాగునీటి కోసం రోజూ గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటున్నా, కనీస అవసరమైన మంచినీటిని కూడా అందించలేకపోతున్నాయని వారు విమర్శిస్తున్నారు.డీప్ బోరు పనులను చేపట్టిన కాంట్రాక్టర్ సరైన లోతులో బోరు వేయకపోవడమే ప్రస్తుతం నీటి సమస్యకు ప్రధాన కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.నాణ్యత ప్రమాణాలను పాటించకుండా పనులు పూర్తి చేయడంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయని, దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.నిధులపై చూపిన శ్రద్ధ... మా దాహం తీర్చడంపై ఎందుకు చూపలేదు? అంటూ తాండా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి బోరును సాంకేతికంగా పరిశీలించి, అవసరమైతే కొత్త డీప్ బోరు ఏర్పాటు చేసి అక్కపాలెం తాండా గిరిజనులకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# స్కంధ గిరిలో ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక పూజలు



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 06**

ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు గురువారం ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించిన ఆడి కృత్తిక వేల్ కావడి ఉత్సవంలో పాల్గొన్నారు. స్థానిక స్కంధగిరి శివాలయంతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దామచర్ల జనార్ధన్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ రావు మాట్లాడుతూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆకాంక్షించారు. ఆడికృత్తిక పుణ్యతిథిని పురస్కరించుకొని స్కందగిరి, గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వెలిసిన వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, కుమార్తెలు అనీషా లక్ష్మీ, తనూజా లక్ష్మి వేల్‌కావడి మోస్తూ గుడిచుట్టూ ప్రదక్షిణ చేశారు. తమిళ సంప్రదాయంలో ఆషాధ మాసంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన చేసి, వేల్‌కావడి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. నగరంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తులు వేల్‌కావడి స్వామి వారికి సమర్పించుకునేందుకు దేవాలయాలకు వచ్చి కన్నయ్య గురుస్వామి ఆధ్వర్యంలో శూలాలు నోట్లో గుచ్చుకొని భక్తి ప్రపత్తులను చాటుకుంటారని తెలిపారు. ఆలయ నిర్వాహకులు దామచర్ల జనార్ధన్ ను ఘనంగా సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో నగర టిడిపి పార్టీ అధ్యక్షుడు బండారు మదన్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ యక్కల తులసీరావు, శివాలయం దేవస్థానం ఛైర్మన్ తూము సుబ్బారావు,కాళహస్తి దేవస్థానం బోర్డు మెంబరు కామరాజుగడ్డ కుసుమ కుమారి, మాజీ కార్పొరేటర్లు కిట్టు, గిరిజా శాండిల్య, టిడిపి నాయకులు పెద్దిశెట్టి వరలక్ష్మి,తూము రాజేష్, అజయ్, పి.ఎస్.బాబు, సుజాత, పప్పుశ్రీను, తదితరులు పాల్గొన్నారు.



# కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఉత్తమ మార్గం

## -కందుకూరులో అవగాహన కార్యక్రమం - 1కే రన్ నిర్వహణ

**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 6**

పరస్పర అంగీకారంతో, స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం (మెడియేషన్) అత్యంత సమర్ధవంతమైన విధానమని కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ అధ్యక్షులు కె.కె.వి. బులి కృష్ణ అన్నారు.జాతీయ మధ్యవర్తిత్వ అవగాహన వారోత్సవాల సందర్భంగా మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో గురువారం కందుకూరు కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ, ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మధ్యవర్తిత్వ విధానంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.మధ్యవర్తిత్వం ద్వారా కేసులు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పరిష్కారమవడంతో పాటు ఇరుపక్షాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంలోనూ




మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అనంతరం కోర్టు ఆవరణ నుంచి కనిగిరి రోడ్డులోని ఆర్టీసీ డిపో వరకు 1కే రన్ నిర్వహించి ప్రజలకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి. దుర్గా కళ్యాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎల్.




అన్నపూర్ణ, ఏజీపీ బి. కృష్ణయ్య చౌదరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలేటి శ్రీధర్ నాయుడు, మధ్యవర్తి షేక్ జమీర్, న్యాయవాదులు సంపత్ కుమార్, షంసుద్దీన్, పవన్ కుమార్, సాయి శంకర్, మురళి, బ్రహ్మయ్యతో పాటు కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణ



**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 6**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కందుకూరు ఏ సెక్టార్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ--1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ ఉషారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూపర్‌వైజర్ యు. ప్రభావతి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్ యు. ప్రభావతి మాట్లాడుతూ, ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, అవి తొలి టీకాలా పనిచేసి శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. అలాగే శిశువుకు ఆరు నెలలు పూర్తయ్యే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు.ఏఎన్ఎం మాట్లాడుతూ, శిశువుకు సరైన పద్ధతిలో తల్లిపాలు పట్టించాలని, పాలు తాగే సమయంలో పొరపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిపాలు తాగే పిల్లలు అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందుతారని చెప్పారు.సీడీపీఓ ఉషారాణి మాట్లాడుతూ, తల్లిపాలు శిశువు ఎదుగుదలకు అత్యంత కీలకమని, తల్లికి కూడా ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి కొన్ని రకాల క్యాన్సర్‌ల ప్రమాదం తగ్గడంతో పాటు తల్లి--బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోటి రత్నం, కేశవకుమారి, శ్రీలక్ష్మి, శ్రీదేవి, రమాదేవి, షాకీర్ బాను, యాసిమిన్‌తో పాటు గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# తల్లి పాలు అమృతం

### శిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రు పాలు త్రాపాలి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

ఆరోగ్యవంతమైన పిల్లలను త్యారుచేయడంలో తల్లిపాలు చేసే మేలు దేవుడి సృష్టిలో ఓ అద్భుతం బిడ్డప్రసవించిన తరువాత ఇచ్చే ముర్రు పాలు బిడ్డ ఆరోగ్యంపై జీవితం పై చూపుతుందిని అంగన్వాడి కార్యకర్తలు పేర్కొంటున్నారు గిద్దలూరు-2 సెక్టార్ లోని మాయాబజార్, కోడ్ నెంబర్10 అంగన్వాడీ కేంద్రంలో గురువారం నాడు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు అంగన్వాడీ కార్యకర్త యస్ వరలక్ష్మీ మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంను ఈ నెల 1నుండి 7వ తేదీ వరకు నిర్వహించ నున్నట్లు తెలిపారు . శిశు ఆరోగ్యానికి తల్లి ముర్రుపాలు పట్టడం కారణంగా పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పిల్లల తల్లులకు తల్లిపాల విలువ గురించి, తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం వల్ల పిల్లలకు కలిగే ఆరోగ్యము గురించి వివరంగా వరలక్ష్మి వివరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మీ, గర్భవతులు, బాలింతలు ప్రీ స్కూల్ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు న్యాయమైన ధరలు కల్పించాలి

### మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 6**

పొగాకు రైతులకు న్యాయమైన ధరలు లభించే విధంగా చూడాలని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. గురువారం నాడు ఆయన స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. అలాగే అక్కడ జరుగుతున్న వేలం ప్రక్రియను పరిశీలించిన నారాయణరెడ్డి పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. పొగాకుబేళ్ళకు నోబిడ్ లేకుండా చూడాలని, రైతులకు గిట్టుబాటు ధరలు లభించే విధంగా బోర్డు అధికారులు, కొనుగోలుదారులు చూడాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెంట రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, దేశం నాయకులు ముల్లా కుద్దూస్, వీరిశెట్టి సురేష్, ముని శ్రీనివాసులు, మీగడ ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డీఎస్సీ పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

## -ఏపీ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 6:**



1996 నుండి 2025 వరకూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పనిచేసిన కాలంలో 9 డీఎస్సీలను పారదర్శకంగా నిర్వహించి 2,16,179 మంది ఉపాధ్యాయ నియామకాలను చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేనని ఏపీ విద్య సంక్షేమ మౌలికవస్తుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు అన్నారు. గత వైకాపా పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిన సంగతి అందరికీ తెలుసు అని అన్నారు. విద్యార్థుల బ్యాగులు, బెల్టులు ఆఖరికి వారికి అందించే చిక్కిపై కూడా జగన్మోహన్ రెడ్డి ఫోటో వేసి స్కూలు విద్యార్థుల మనసుల్లో కూడా విష బీజాలను నాటాలని చూశారు అని విమర్శించారు. ఆఖరికి ఉపాధ్యాయులను మద్యం దుకాణాలు వద్ద కాపలా ఉంచారు, అలాంటి పరిస్థితుల్లో వైకాపా అరాచకాలను తట్టుకోలేక ఉపాధ్యాయులు చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి అప్పటి వైకాపా ప్రభుత్వంపై నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నారా లోకేష్ ఆధ్వ ర్యంలో విద్యా శాఖలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చి వైకాపా పాలనలో భ్రష్టుపట్టి పోయిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత లోకేష్ ది అని అన్నారు. లోకేష్ విద్యాశాఖ మంత్రిగా మెగా డిఎస్సి, నో బ్యాగ్ డే, టీచర్ ట్రాన్స్ఫర్ యాక్ట్, సెంట్రలైజడ్ స్మార్ట్ కిచెన్, ఎన్ సి ఇ ఆర్ టి కరిక్యులం, బైలింగ్వల్ సిలబస్, తల్లికి వందనం, లీప్ స్కూల్, ఒకే తరగతి ఒకే టీచర్, విద్యా మిత్ర కిట్లు, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్, ముస్తాబు కార్యక్రమం లాంటి ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థను అగ్ర గామిగా నిలిపి కూటమి ప్రభుత్వానికి విద్యావ్యవస్థ పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేశారు.అది చూసి ఓర్వలేక ఏ వంక దొరక్క డీఎస్సీ లో ఏదో జరిగింది అని అసత్య ప్రచారాలు చేసి 2025 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమించబడ్డ16,347 మంది మనోభావా లతో ఆటలాడకుండా ఇప్పటికైనా వైకాపా నాయకులు వాస్తవాలు తెలు సుకుని అసత్య ప్రచారాలు మానుకోవాలని రాంబాబు తెలియజేశారు.

# కందుకూరులో వైసీపీకి బుర్ర మధుసూదన్ యాదవే బలమైన నాయకుడు

### -కాకాణి గోవర్ధన్ రెడ్డి -జగన్‌కు మధుపై అపారమైన విశ్వాసం

### --వచ్చే ఎన్నికల్లో కందుకూరు నుంచి వైసీపీ అభ్యర్థి బుర్రేనని స్పష్టం

### --పార్టీ శ్రేణులంతా మధుకు అండగా నిలవాలని పిలుపు



**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 6**

కందుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ బలమైన నాయకత్వం అందిస్తున్నారని, ఆయనకు పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మధుసూదన్ యాదవ్ మృదుస్వభావి, సంస్కారం కలిగిన నాయకుడని, కందుకూరు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తిగా ఆయనను కొనియాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇచ్చే నాయకుడిగా మధు గుర్తింపు పొందారని అన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుర్ర మధుసూదన్ యాదవ్ పోటీ చేస్తారని, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయనపై అపారమైన నమ్మకం ఉందని కాకాణి తెలిపారు. ఎలాంటి రాజకీయ కుట్రలు జరిగినా కందుకూరులో వైసీపీ జెండా ఎగరవడం ఖాయమని, బుర్ర మధుసూదన్ యాదవ్ అసెంబ్లీలో అడుగుపెడతారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని అంకితభావంతో విజయవంతం చేయడంలో మధుసూదన్ యాదవ్ ఎప్పుడూ ముందుంటారని ఆయన పేర్కొన్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర సాధన కోసం చేసిన ఉద్యమాలు, రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటాలు, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి ప్రజలకు సుపరిచితమని అన్నారు. కందుకూరు అభివృద్ధి లక్ష్యంగా బుర్ర మధుసూదన్ యాదవ్ కట్టుబడి పనిచేస్తున్నారని, ఆయనకు పార్టీ అన్ని విధాలా సహకారం అందిస్తుందని కాకాణి స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి బుర్ర మధుసూదన్ యాదవ్‌కు పూర్తి మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

# శ్రీరామ్ హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 06**

గత 15 సంవత్సరాలుగా ప్రతి నెల మొదటి గురువారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో భాగంగా శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో నిర్వహించిన మొదటి గురువారం ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో చిన్నపిల్లల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు చిన్న పిల్లలు , పురిటి బిడ్డల వైద్య నిపుణులు డాక్టర్ కలంకుంట్ల గంగా సాగర్ రెడ్డి ప్రత్యేక ఆరోగ్య సూచనలు చేశారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు సాధారణంగా వచ్చే దయాబెటిక్ ఫుట్ సమస్యపై సీనియర్ వైద్యులు డాక్టర్ పిన్నాక ప్రశాంత్ సమగ్రంగా వివరించారు. దయాబెటిక్ ఫుట్‌కు గల కారణాలు, ప్రారంభ లక్షణాలు, రోజువారీ పాదాల సంరక్షణ, గాయాలను నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే ప్రమాదాలు, సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం యొక్క ప్రాముఖ్యత గురించి ఆయన అవగాహన కల్పించారు. సుమారు 300 మంది తమ ఆరోగ్య సంరక్షణ కోసం అల్ట్రా సౌండ్ స్కాన్, కంప్యూటర్ ద్వారా వివిధ రకాల ఆధునిక కంటి పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్, థైరాయిడ్, హిమోగ్లోబిన్, బీ ఎం డి, దంత పరీక్షలు లాంటి 10 వేల రూపాయల విలువ గల 16 రకాల వివిధ టెస్ట్ లను ఈ శిబిరంలో ఉచితంగా వినియోగించుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు సీనియర్ ఎముకలు, కీళ్లు, నరములు, కీళ్ల మార్పిడి, యాక్సిడెంట్, వెన్నెముక శస్త్ర చికిత్సా నిపుణులు, చీఫ్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ, సీనియర్ గర్భకోశ ప్రసూతి వైద్య నిపుణులు, హైరిస్క్ ప్రెగ్నన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంత కుమారి, డయాబెటాలజిస్ట్, జనరల్.. ఫ్యామిలీ ఫీజిషియన్ డాక్టర్ సానల ధీరజ్ బాబు, సీనియర్ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ , మినిమల్ యాక్సెస్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ పిన్నిక ప్రశాంత్, ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ నాగిడి కుమార్ వర్మ, కంటి స్పెషలిస్ట్ డాక్టర్ పురాణపు మహిత, చెవి ముక్కు గొంతు ఈ ఎన్ టి స్పెషలిస్ట్ డాక్టర్ తాడి సాయి ప్రసాద్, అనస్థీషియా.. క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ముప్పరాజు దీప్తి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, స్మైల్ డిజైనింగ్, డెంటల్ ఒ కాస్మొటిక్ సర్జన్ డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వినయ్, షైక్ లాల్ , ఫీజియోథెరపీ వైద్య నిపుణులు డాక్టర్ పొక్కినగారి ఏడుకొండలు, హాస్పిటల్ మేనేజర్ పల్లా సురేష్ , మార్కెటింగ్ మేనేజర్ మణి చంద్ర కాంత్ పాల్గొన్నారు.

# అదుపుతప్పి లారీ బోల్తా

### సురక్షితంగా బయటపడ్డ సిబ్బంది



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 6**

కొమరోలు మండలం ఎర్ర పల్లి సమీపంలో కడప విజయవాడ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన జరిగింది. రాజమండ్రి నుంచి పూల మొక్కలతో బయలుదేరిన లారీ కొమరోలు మీదుగా కదిరికి వెళుతున్నది.అయితే వేగంగా వెళుతున్న లారీ గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కొమరోలు పట్టణం దాటిన తర్వాత ఎర్ర పల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో వాహనానికి సైడ్ ఇచ్చే ప్రయత్నంలో పూల మొక్కలతో వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు మార్జిన్ లోని పొలాల్లోకి వేళ్ళి బోల్తా పడింది.ఆ ప్రమాదం లో లారీలో ఉన్న సిబ్బంది అదృష్టవశాత్తు సురక్షితంగా బయటపడ్డారు. అయితే అదృష్టవశాత్తు లారీ రోడ్డు మార్జి లో ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న కొమరోలు పోలీసులు సంఘటన స్థలం చేరుకొని వివరాలు సేకరించారు.

# రౌతు పల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 6**

కొమరోలు మండలం రౌతు పల్లెలోని అంగన్వాడి కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఆ గ్రామంలోని అంగన్వాడీ టీచర్ పి. లక్ష్మీదేవి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు.ఆ కార్యక్రమానికి అంగన్వాడి కేంద్ర పరిధిలోని తల్లులు, బాలింతలు, గర్భవతులు, హాజరయ్యారు. వారికి తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యత తో పాటు తల్లులు,బాలింతలు, గర్భవతులు, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి వివరించారు. తల్లిపాలు అమృతం వంటివని, అందువల్ల పుట్టిన వెంటనే శిశువులకు ముర్రుపాలు తాపించాలని, అంతేకాక శిశు వుకి పోత పాల కంటే తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఆమె వారికి వివరించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆమె వారికి సూచించారు. ఆ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా సుబ్బలక్ష్మమ్మ తల్లులు, బాలింతలు, గర్భవతులు, చిన్నారులు పాల్గొన్నారు.

# నారాయణస్వామి ఆరాధన

## ఆదాయం రూ. 1,90,528/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 6**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆరాధన మహోత్సవ వేడుకల ఆదాయం రూ.1,90,5288/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 71,730/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.43,190/- లు, శాశ్వత అన్నదాన పథకం నకు రూ,64,576/- లు , స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .11,032/- లు వచ్చినట్లు తెలిపారు.



# అన్నా క్యాంటీన్ తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు

## టీ స్టాల్ లో టీ సేవిస్తూ ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలు తెలుసు కుంటూ పరిష్కార దిశగా అడుగు లేస్తూ





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ గురువారం నాడు మధ్యాహ్నా భోజన సమయంలో అన్నా క్యాంటీన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్ భోజనం చేస్తున్నా వారిని ఆప్యాయంగా పలకరించి భోజనం ఎట్లా ఉంది , సాంబారు రుచి ఎట్లఉంది, వంటలు నాణ్యత గాఉన్నాయ అని వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నాణ్యత లేకపోతే నిర్భయంగా తెలపండి మార్పుల చేసే ప్రయత్నం చేస్తాం , అని కమీషనర్ ఆడగగా భోజనం చేస్తూన్న ముదుసలులు, యువకులు భోజనం భేషుగ్గా ఉందని తెలిపారు .ఈసందర్భంగా క్యాంటీన్ లో భోజనం చేసి వెళ్లిన తరువాత మరో బ్యాచ్ కు టేబుల్స్ శుభ్రం చేయించాలని సూచించారు . ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నిత్యం అన్న క్యాంటీన్ లో 400మంది వరకు భోజనాలు చేస్తున్నారని తెలిపారు. రోజు రోజుకు సంఖ్య పెరుగుతోందన్నారు. ఉదయం టిఫిన్, రాతి భోజనం వడ్డించటం జరుగుతుందన్నారు. అన్నా క్యాంటీన్ ఎంతో మందికి ఎంతో మేలుచేస్తుందన్నారు ఉదయాన్నే టీ స్టాల్ ప్రజలతో మమేకమై టీ సేవిస్తూ సమస్యలు ఆరా తీస్తూ గిద్దలూరు పట్టణ వీధులలో కలియ తిరుగుతూ శానిటేషన్ పనులను పరిశీలిస్తూ నే ప్రజల కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటం లోను,సమస్య లు తెలుసుకొని పరిష్కరించడం లో ను మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు తన దై న శైలి లో పని చేస్తూ ప్రజా హృదయాల్లో నిలిచి పోతున్నారు.ప్రతి రోజు ఉదయం ఐదున్నర గంటలకే మున్సిపాలిటీ వీధుల్లో పర్యటించడం పారిశుద్ధ్య పనుల ను పరిశీలించడం,ఆయా ప్రాంతాల్లో ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని శరవేగంగా పరిష్కరించడం లో తన దైన ముద్ర వేసుకొని ప్రజల తో మమేకం కావటం ఆయన రోజు వారి చర్య లో భాగంగా మారింది.కమీషనర్ ఏ వార్డు లో పర్యటించిన అక్కడి ప్రజలు ఆయన ను ఆప్యాయంగా ఆహ్వానిస్తూ కష్ట సుఖాలను చెప్పుకోవడం వాటిని కమీషనర్ ఆలకించటం పరిష్కరించడం ఆనవాయితీ గా మారింది.పట్టణం లో పర్యటిస్తూ సమీపం లో ని టీ స్టాల్స్ వద్ద ఉన్న ప్రజల ను చూసి కమీషనర్ రమణ బాబు వారిని ఆప్యాయంగా చిరునవ్వు తో పలకరిస్తూ వారి తో పాటి కలిసి టీ సేవిస్తూ సరదాగా గడపటం ,మీ వార్డు లో ని సమస్యలు ఉంటే చెప్పండి అంటూ మాటా మంతి గా కలుపుతారు. దాంతో కొందరు తమ వార్డు లో ని సమస్య ల ను కమీషనర్ దృష్టి కి తీస్కువస్తారు. అందుకు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం, వెనువెంటనే ఆ సమస్య ల ను పరిష్కరించి ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవడం ఆయన కు అలవాటు గా మారింది. ఎక్కడా లేని విధంగా మున్సిపల్ కమిషనర్ ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకోవటం వెంటనే వాటిని పరిష్కరించడం ఆయన కు వెన్న తో పెట్టిన విద్య గా మారింది. దీన్ని చూసి ప్రజలు ముక్కున వేలు వేసుకొని కమీషనర్ అంటే ఇలా ఉండాలి అని వ్యాఖ్యానించటమ్ జరుగుతోంది.ప్రజల కు అవసరమైన మౌలిక సదుపాయాలు మంచి నీరు పారిశుద్ధ్య శీ, డ్రైనేజీ లో పూడిక తీ త పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కమీషనర్ ముందుకు సాగుతున్నారు. ఆయన భాధ్యతలు స్వీకరించిన ఏడాదికి శాసన సభ్యులు అశోక రెడ్డి సహకారం తో పట్టణ శీ లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి వాటిని పూర్తి చేసి ప్రజాభిమానాన్ని రమణ బాబు పొందుతున్నారు.

# కందుకూరులో ప్రత్యేక వాహన తనిఖీలు

## -7 బైక్‌లు సీజ్ -అనధికార సైలెన్సర్లు, డ్యాజిలింగ్ లైట్లపై ఎంవీఐ అనిల్ కుమార్ హెచ్చరిక



**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 6**

కందుకూరులో ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా మోటారు వాహనాల శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి జంగాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కోటారెడ్డి సర్కిల్ వద్ద నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న మోటార్ సైకిళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనధికారికంగా మార్పులు చేసిన సైలెన్సర్లు, డ్యాజిలింగ్ (ఎల్‌ఈడీ/ఫోకస్) లైట్లు అమర్చిన వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న ద్విచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 7 మోటార్ సైకిళ్లపై కేసులు నమోదు చేసి ఆర్టీసీ డిపోలో సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎంవీఐ జంగాల అనిల్ కుమార్ మాట్లాడుతూ, వాహనాలకు అనుమతి లేని డ్యాజిలింగ్ లైట్లు అమర్చడం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులకు కంటి చూపు ఇబ్బందులు ఏర్పడి రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన సైలెన్సర్ల వల్ల అధిక శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లు, అనుమతి లేని డ్యాజిలింగ్ లైట్ల వినియోగం చట్టరీత్యా నేరమని, అలాంటి వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేయించడం కూడా చట్టవిరుద్ధమని, అలా పట్టుబడితే సంబంధిత వాహనదారులతో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వాహనదారులు అధిక వేగంతో ప్రయాణించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర యూరప్ ప్రాంతీయ సమన్వయకర్తగా ఎమ్మెల్యే ముత్తుముల సోదరుడు జగన్నాధ రెడ్డి నియామకం



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర యూరప్ ప్రాంతీయ సమన్వయకర్త గా నియమితులైన గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల జగన్నా ధ రెడ్డి ని ఏ పి రాష్ట్ర ప్రభుత్వం నియమించింది, ఈసందర్భంగా ముత్తుముల జగన్నాధ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ భాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముత్తుముల జగన్నాధ "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు యువనేత, మంత్రి నారా లోకేష్ కు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు రవికుమార్ వేమూరు కి, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి శ్రీనివాస్ కొండపల్లి కి ఎపి ఏన్ ఆర్టీ సీఈఓ కృష్ణ మోహన్ కు నాపై ఉంచిన అపారమైన నమ్మకానికి, వారు అందించిన మద్దతుకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని పేర్కొన్నారు. ఉత్తర యూరప్ ప్రాంతీయ సమన్వయకర్తగా లభించిన ఈ గౌరవాన్ని పూర్తి బాధ్యతాయుతంగా, నిబద్ధతతో స్వీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయంగా ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ ప్రవాసులతో మరింత అర్థవంతమైన బంధాలను పెంపొందించడం అనే ప్రభుత్వ ఆశయ సాధనలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిష్కపటత్వంతో, చిత్తశుద్ధితో , శ్రేష్ఠతతో సేవ చేయడానికి తాను నిరంతరం కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. తనకు ఈ గొప్ప అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ.. నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని, అంచనాలను నిలబెట్టుకునేందుకు శ్రమిస్తానని జగన్నాధ ముత్తుముల ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

# స్మశానానికి పురోగతి కొలువు తీరనున్న వంతెన

## పాత మాగులూరులో శర వేగంగా నూతన వంతెన నిర్మాణం



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 6**

పాత మాగులూరు గ్రామంలోని స్మశాన వాటికకు వెళ్లే రహదారిపై నిర్మిస్తున్న నూతన వంతెన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో రూ.20 లక్షల వ్యయంతో మంజూరైన ఈ వంతెన నిర్మాణం ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది. ఏళ్ల తరబడి స్మశాన వాటికకు వెళ్లే మార్గంలో సరైన దారి లేకపోవడంతో, ముఖ్యంగా వర్షాకాలంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్తుల అవసరాన్ని గుర్తించిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చేవూరి వాసురెడ్డి, గడ్డం నాగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్ తదితర ప్రజాప్రతినిధులు ఈ సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల అవసరాన్ని గుర్తించిన మంత్రి వెంటనే స్పందించి రూ.20 లక్షలతో వంతెన నిర్మాణానికి మంజూరు కల్పించి, పనులు వేగంగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు.

**ప్రజాప్రతినిధుల చొరవ ఫలించింది**

గ్రామ ప్రజల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించారని గ్రామస్తులు పేర్కొన్నారు. వారి కృషితో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

**మంత్రికి గ్రామస్తుల అభినందనలు**

గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేసి, వంతెన నిర్మాణానికి ప్రత్యక్ష సహకారం అందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రామస్తులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అలాగే సమస్య పరిష్కారానికి కృషి చేసిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చేఊ రి వాసురెడ్డి, గడ్డం నాగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్‌కు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు.

**త్వరలో ప్రజలకు అందుబాటులోకి**

ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో వంతెన త్వరలోనే పూర్తయ్యే అవకాశముంది. ఇది అందుబాటులోకి వస్తే స్మశాన వాటికకు వెళ్లే రాకపోకలు సులభతరం కావడంతో పాటు పాత మాగులూరు గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

# రెండేళ్ల నమ్మకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## కొప్పురం గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్, వాసురెడ్డి



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 6**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా గురువారం సంతమాగులూరు మండలం కొప్పురం గ్రామంలో ఇంటింటి ప్రచారం ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్, మండల నాయకులు వాసురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

**ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరింపు**

ఇంటింటికి వెళ్లిన నాయకులు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సంక్షేమంతో పాటు గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, రైతులు, మహిళలు, యువత కోసం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

**పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మద్దిరాల గంగాధర్, మండల టీడీపీ అధ్యక్షుడు చేవూరు వాసిరెడ్డి, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్, క్లస్టర్ ఇన్‌చార్జి కంచేటి మురళీకృష్ణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుంజి శ్రీనివాసరావు, మొగిలి సుబ్బారావు, గుంజి అంకమ్మరావు, బోడ కాలే, మల్లా సుభాని, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 108లో ప్రసవం... అత్యవసర సేవలకు అభినందనీయం

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 6**



సంతమాగులూరు మండలం కుందుర్రు గ్రామానికి చెందిన పొట్లూరు పవిత్రకు బుధవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఆమెను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో పైలట్ పి. నాగరాజు వాహనాన్ని సురక్షితంగా నిలిపారు. ఈఎంటీ జి. అశోక్ చాకచక్యంగా వ్యవహరించి అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించగా, పవిత్ర పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉండటంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

**అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు ప్రాణదాత..:** రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో 108 అంబులెన్స్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రమాదాలు, గుండెపోటు, ప్రసవ వేదనలు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఒక్క ఫోన్‌కాల్‌తో వేగంగా స్పందిస్తూ ప్రాణాలను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సమయానికి వైద్య సహాయం అందని పరిస్థితుల్లో 108 సేవలు ఎంతో మంది ప్రాణాలకు భరోసాగా నిలుస్తున్నాయి.

**అంబులెన్స్‌లోనే సురక్షిత ప్రసవాలు..:** ఆసుపత్రికి చేరుకునేలోపే ప్రసవ వేదనలు ఎక్కువయ్యే సందర్భాల్లో 108 అంబులెన్స్‌లలో పనిచేసే ఈఎంటీలు ప్రత్యేక శిక్షణతో సురక్షిత ప్రసవాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు అత్యవసర సేవల సామర్థ్యాన్ని, సిబ్బంది అంకితభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

**ప్రజలకు సూచన..:** గర్భిణులకు ప్రసవ వేదనలు ప్రారంభమైన వెంటనే ఆలస్యం చేయకుండా 108కు సమాచారం ఇవ్వడం ద్వారా తల్లి, శిశువుల ప్రాణాలను సురక్షితంగా కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన 108 సేవలు ఆరోగ్య రంగంలో విశ్వసనీయ సేవగా కొనసాగుతున్నాయి.

# 12 జాతీయ లోక్ అదాలత్

## రాజీ మార్గమే రాజమార్గం

## అధిక కేసులు రాజీ అయ్యే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలి

## ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ భరత్ చంద్ర



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

ఈనెల 12 న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేసే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె. భరత్ చంద్ర గురువారం పోలీసు అధికారుల తో జరిగిన సమీక్ష సమావేశంలో తెలియజేశారు. లోక్ అదాలత్ నందు కేసులు రాజీ చేసుకోవడం ద్వారా, కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, ధనమును, ఆదా చేసుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమని ,ఇరు పార్టీలు ప్రశాంత జీవితమును గడపాలని హితవు పలికారు. రాజీ పడతగిన క్రిమినల్ కేసులు ,అన్ని రకముల సివిల్ కేసులు, గృహహింస కేసులు, భరణం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కోర్టుల వరకు వెళ్లని ప్రీ - లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవలసినదిగా, కక్షిదారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ ,కంభం సిఐ కె. మల్లికార్జున, గిద్దలూరు ,రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట , అర్ధవీడు పోలీస్ స్టేషన్ల కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ

## ఎంఈఓ జె ప్రసాదరావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 6**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం ప్రాథమిక ఎస్సీ ఆదర్శ పాఠశాలలోని భవిత కేంద్రంలో గురువారం మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు (సిడబ్ల్యూఎస్ఎన్) ఉచిత సహాయక ఉపకరణాలను మండల విద్యాశాఖాధికారి జె ప్రసాదరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు విద్యలో రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అందజేస్తున్న ఉపకరణాలు విద్యాభ్యాసంలో ఎంతో ఉపయోగపడతాయని, ఆత్మవిశ్వాసంతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు అనంతరం విద్యార్థులకు ఉపకరణాలను అందజేసి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు పిల్లల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలు మరియు సంక్షేమ పథకాలను తల్లిదండ్రులు మరియు దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆంథోనీ , ఉపాధ్యాయులు శ్రీను , భవితా కేంద్రం ఐ ఈ ఆర్ టి టీచర్ వేల్పుల వెంకట్రావు,విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

గిద్దలూరు పట్టణంలోని 4 వ వార్డు ఏ బి ఎమ్ పాలెం నందు "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు , ప్రజలు ఎమ్మెల్యే కు సాదర స్వాగతం పలికారు వార్డు లోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు., ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం , గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం వార్డు నాయకులు, మహిళలు ప్రజలు " ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు అర్ధవీడులో అశోక్ రెడ్డి ప్రజా దర్బార్

## కలెక్టర్ విజయ సునీత పాల్గొంటారు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**



గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం నాడు అర్ధవీడు మండలంలో పర్యటించనున్నారు. అశోక్ రెడ్డి ఉదయం 10.30 లకు అర్ధవీడు మండల తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయ సునీత తో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజలనుంచి సమస్యల పై అర్జీలు సవీకరించి సమస్యల పరిస్కారంకోసమే కృషి చేయనున్నారు.ఇదే రోజు సాయంత్రం 5 గంటలకు అర్ధవీడు మండలం, మొహిద్దిన్ పురం గ్రామంలో నిర్వహించే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అర్ధవీడు మండల ప్రజలు ప్రజాదర్బార్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం విజయాలు కార్య క్రమం జయప్రదం చేయాలని కోరారు.

# పొదిలి మునిసిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ జరిపిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 6**

మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పొదిలి మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ జరిపారు. గురువారం నాడు ఆయన పొదిలిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మునిసిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు అందించారు. అధికారులు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. అలాగే పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజల నుండి వస్తున్న వినతుల పై ఎమ్మెల్యే నారాయణరెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించడంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెంట పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, నాయకులు తానికొండ వెంకటరావు, ముల్లా కుద్దూస్, షేక్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి ఏఎస్ఐ మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కందుల



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 6**

పొదిలి పోలీస్ స్టేషన్లో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన కె శ్రీనివాసరావు మృతదేహాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సందర్శించారు. ఏఎస్ఐ మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే ఏఎస్ఐ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెంట రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, జి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలు

## శిశుఆరోగ్యానికి కీలకం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

గిద్దలూరు మండలం, క్రిష్ణంశెట్టిపల్లిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆగస్టు 1 నుండి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ఏ. రామ జ్యోతి, బి. రాధ, బి. లక్ష్మీ దేవి గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.




# డియస్సి లీకేజి పాపంలో లోకేష్ రాజీనామా చేయాలి

## వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్టు 6**

నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలాడుకుని, కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించుకున్న వారి ఉద్యోగాలను అక్రమంగా అమ్ముకున్న డియస్సి లీకేజి పాపం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దేనని కేంద్రమంత్రి రాజీనామా చేసినట్లు లోకేష్ రాజీనామా చేయాలని రాష్ట్ర వైస్సార్సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. డియస్సి పేపర్ లీకేజిని వ్యతిరేకిస్తూ జాతీయ రహదారిపై రిలే నిరాహారదీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వ్యవస్థను నాశనం చేస్తూ, ముఖ్యంగా విద్యా వ్యవస్థనుసంపూర్ణంగా చంపేశారని అన్నారు.అనేక సంవత్సరాల తర్వాత విద్యా శాఖను దిగజార్చిన మంత్రి లోకేష్ డియస్సిలో పెద్ద ఎత్తున స్కాం చేసాడని, 15,20,లక్షలకు ఉద్యోగాలను అమ్ముకున్నాడని అన్నారు. పేపర్ లీక్ చేసి పరీక్షలు రాయించి, స్పోర్ట్స్ కోటను 2నుంచి 3చేసి జీ ఓ 74ను ఇష్టానుసారంగా 4,47,జీ ఓ తెచ్చి అక్రమంగా ఉద్యోగాలు అమ్ముకున్న ఘనుడు లోకేష్ అని మండి పడ్డారు. రాష్ట్రంలో యువతకు తీవ్ర అన్యాయం చేసాడని నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వలేదని, 20లక్షల ఉద్యోగాల కల్పన జరగలేదని, విద్యాదీవెన,వసతి దీవెన అటకెక్కించారాని విమర్శలు గుప్పించారు. అమ్మవడి పేరు మార్చి నేమ్ చేంజర్ గా మారిన చంద్రబాబు ప్రజా పథకాల వ్యవస్థను సర్వ నాశనం చేసాడని అన్నారు. వైస్సార్సీపీ ప్రజల పక్షాన పోరాడుడుతుందని, రాష్ట్రంలో ఏ సమస్య వచ్చిన స్పందించేది వై యస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. నియోజకవర్గంలో యువత డియస్సిరాసి ఉద్యోగం రాకఅల్లాడుతున్నారని,డియస్సి పేపర్ లీక్ విషయంలో లోకేష్ రాజీనామా చేయకపోతే దీక్షలు కొనసాగుతాయని, కూటమి నాయకులు దీక్షలు అడ్డుకుంటే పరోక్షంగా పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్సార్సీపీ ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, జడ్పీటీసీ చేదురి విజయ భాస్కర్,జిల్లా ఐటీవింగ్ అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి,అయిదు మండలాల అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి,దోమకాల వెంకటేశ్వర్లు, కృష్ణ రెడ్డి,పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాధ్,యంపీపీ ఆళ్ళ ఆంజినేయరెడ్డి, నాయకులు ఆళ్ళ కృష్ణరెడ్డి,ఓబుల్ రెడ్డి మైనార్టీ నాయకులు సయ్యద్ బుజ్జి, సయ్యద్ జబివుల్లా,షేక్ మునాఫ్, షేక్ బాబు,వైశ్య నాయకులు ఐవి సుబ్బారావు, కందూరిగురు, యక్కలి రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.





# అకడమిక్ ఇన్స్ట్రక్టర్ల ను వెంటనే నియమించాలి

## ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు నాయబ్ రసూల్ డిమాండ్



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 6**

మండలంలో అకడమిక్ ఇన్స్ట్రక్టర్ల నియామకంవెంటనే చేపట్టాలని ఏపీటీఎఫ్ మార్కాపురం జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు మండలంలోని డి జీ పేట జిల్లా పరిషత్ హై స్కూల్ ను గురువారం డిప్యూటీ డిఇఓ సంజీవిని తనిఖీ చేశారు ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి స్టడీ అవర్స్ పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏపీటీఎఫ్ వినతి మండలంలో విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతంగా ఉన్నదని దాదాపు 60 కి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు ఈ మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు, ఉపాధ్యాయులకు అకాడమిక్ పరమైన మార్గదర్శకత్వం అందించడానికి, విద్యార్థుల అభ్యాస ఫలితాలను పెంపొందించడానికి అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ ల సేవలు అత్యంత అవసరంఅన్నారు. ప్రస్తుతం సి.ఎస్. పురం మండలంలో 56 మంది అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ ల అవసరం ఉన్నది. ఈ ఖాళీలను తక్షణమే భర్తీ చేస్తే పాఠశాలల పరిస్థితి మెరుగుపడి, విద్యా నాణ్యత పెరగడంతో పాటు ప్రభుత్వ విద్యాభివృద్ధి లక్ష్యాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయి.కావున, సి.ఎస్. పురం మండల అవసరాలను పరిగణనలోకి తీసుకొని, అవసరమైన 56 మంది అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ లను నియమించి విద్యాభివృద్ధికి సహకరించవలసిందిగా ఏపీటీఎఫ్ మార్కాపురం జిల్లా శాఖ తరఫున కోరుకుంటూ వినతి పత్రాన్ని డిప్యూటీ డిఇఓ కు అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం కమిషనర్ రాజాల కొండారెడ్డి, ఎంఈవోలు జె ప్రసాదరావు, డేవిడ్ ఏపీ టీ ఎఫ్ జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ మండల శాఖ అధ్యక్షులు తోట శ్రీనివాసులు దండే శ్రీనివాసులు జి వెంకటేశ్వర్లు గాలి రవీంద్ర కే సుభాషిని భవాని సరోజినమ్మ ఆర్ సుబ్బయ్య తదితరులున్నారు.

# గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే స్థానిక సంస్థల్లో పునరావృతం కావాలి

## బీజేపీ శ్రేణులకు ఆ రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 6**



రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల పోరులో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే కూటమికి పునరావృతం కావాలని, ఆ దిశగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని, కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కూటమి విజయ పరంపరను మరింత ఘనంగా కొనసాగిద్దామని ఆయన పిలుపు నిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవా లక్ష్యాలను ప్రతి ఇంటికీ చేర్చే దిశగా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని డాక్టర్ ఏలూరి సూచించారు.

# నేరాల నియంత్రణకు పోలీసుల ముమ్మర గస్తీ

## - ఏటీఎంలు, లాడ్జిలు, ప్రధాన వ్యాపార కేంద్రాలపై ప్రత్యేక నిఘా






**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 06**

నేరాల నియంత్రణే, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది రాత్రి వేళల్లో గస్తీ విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దొంగతనాలు, ఇతర నేర సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులను, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. జిల్లాలోని ఏటీఎంలు, బ్యాంకులు, ప్రధాన వ్యాపార కేంద్రాల వద్ద భద్రతా చర్యలను మరింత ముమ్మరం చేస్తూ, ఏటీఎం కేంద్రాల వద్ద పోలీసులు నిరంతర గస్తీ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించడంతో పాటు, వాహనాలను తనిఖీ చేసి వాటి రవాణా వివరాలను సేకరిస్తున్నారు. పాత నేరస్తులు, చెడునడత కలిగిన వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచారు. లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్కడ ఉండే వారి ఆధార్ వివరాలను పరిశీలిస్తున్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే దిశగా, రాత్రి వేళల్లో అల్లర్లు, గొడవలు, దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, కారణం లేకుండా తిరిగే ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

# నేడు అర్ధవీడు లో ప్రజా దర్బార్ కార్యక్రమం

## ముఖ్య అతిధులుగా గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**అర్ధవీడు, పెన్ పవర్, ఆగస్టు 6**

మార్కాపురం జిల్లా అర్ధవీడు మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆగస్టు 7వ తేదీ ఉదయం 10:30 గంటలకు "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయ సునీత, స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.మండల పరిధిలోని ప్రజలు, రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

# మధ్యవర్తిత్వంపై మార్కాపురంలో అవగాహన ర్యాలీ

## జాతీయ ప్రచారం 3.0 లో భాగంగా కార్యక్రమం




**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 6**

మార్కాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ మధ్యవర్తిత్వ ప్రచారం 3.0 లో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.కోర్టు ఆవరణం నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక గడియారం స్తంభం సెంటర్ వరకు సాగింది. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, సంస్థ సభ్యులు పాల్గొని మధ్యవర్తిత్వం అని రాసిన బ్యానర్లతో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అడిషనల్ జిల్లా జడ్జి భవాని మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సివిల్, కుటుంబ, ఆస్తి వివాదాలను త్వరగా, ఉచితంగా పరిష్కరించుకోవచ్చున్నారు. కోర్టుల చుట్టూ తిరగకుండా మధ్యవర్తిత్వ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్జీలు దేవేంద్ర రెడ్డి, కిషోర్ కుమార్, బాలాజీ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు పకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**పొదిలి, పెన్ పవర్, ఆగస్ట్ 6**

రైతులు పకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. గురువారం నాడు మండలంలోని కొండాయపాలెం, సలక నూతల, మాదిరెడ్డిపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ పకృతి వైపరీత్యాల పట్ల రైతులు సరైన అవగాహనతో పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయపరంగా వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే రైతులు సాగు చేసే పద్ధతులతో పాటు పంటల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో అన్ని వర్గాలు సంతోషం

**వలేటివారిపాలెం, పెన్ పవర్, ఆగస్టు 6**

కూటమి ప్రభుత్వం పాలనలో అన్ని వర్గాలు, కులాలు, మతాల వారు సంతోషంగా ఉన్నారని, ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరుతోందని పోలినేని పాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు మానికొండ కొండయ్య అన్నారు. గురువారం పోలినేని పాలెం గ్రామంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదాల చిరంజీవి, కామినేని వెంకటేశ్వర్లు, దేవరాల నరసింగరావు, కంచర్ల మాధవ ,తానికొండ మల్లికార్జున, గాజులవర్తి చిన్న కొండయ్య, మొద్దుమాల హనుమంతరావు, పొన్నగంటి మహేష్, పరిటాల వంశీ నాయుడు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ప్రపంచంలో నైతిక విలువలు లేని కుటుంబం నారా కుటుంబం

### -రెండేళ్ల నమ్మకం కాదు ఆంధ్రప్రదేశ్ అమ్మకం -ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాబోయే ముఖ్యమంత్రి జగన్

### -కూటమి పాలనపై ప్రజలు తిరుగబడటం ఖాయం -వైకాపా నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి

### -నైతిక విలువలు ఉంటే విద్యా శాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి -బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్







**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 6**

ప్రపంచంలో నైతిక విలువలు లేని కుటుంబ ఏదైనా ఉంది అంటే అది ఒక్క నారావారి కుటుంబం అని నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. డిఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నిరసనగా కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి యువత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ టిడిపి నాయకులు రెండేళ్ల నమ్మకం అంటూ తిరుగుతున్నారు. అది రెండేళ్ల నమ్మకం కాదు ఆంధ్రప్రదేశ్ అమ్మకం అని ఎద్దేవా చేశారు.డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం.లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి, నైతిక విలువలు లేని కుటుంబం ఏదైనా ఉంది అంటే అది నారావారి కుటుంబమే అని అన్నారు. డిఎస్సీ నియామకాల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని, ప్రభుత్వంపై ఎన్ని నిరసన కార్యక్రమాలు చేపట్టినా స్పందించడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా పేరుతో అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు.?జీవో మార్పులతో డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం తలపెట్టారు. ?2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవో ఎంఎస్ నంబర్ 74 ప్రకారం కేవలం 29 క్రీడాంశాలకు మాత్రమే స్పోర్ట్స్ కోటా వర్తించేది. కూటమి ?ప్రభుత్వంలో జీవో ఎంఎస్ నంబర్ 47 ద్వారా ఈ క్రీడల సంఖ్యను 29 నుండి 65కి పెంచి, స్పోర్ట్స్ కోటాను 2 శాతం నుండి 3శాతంకి మార్చారు.?బ్రిడ్జ్ (పేకాట ), తాడు లాగుడు పోటీలు, యోగాసనాలు వంటి అంశాలను కూడా క్రీడల జాబితాలో చేర్చి, తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించిన వారికి అక్రమంగా ఉద్యోగాలు కట్టబెట్టారని విమర్శించారు.?జీవో ఎంఎస్ నంబర్ 47 తీసుకువచ్చి, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు పోటీ పరీక్షలు (రిటన్ ఎగ్జామ్) రాయాల్సిన అవసరం లేదని మినహాయింపు ఇవ్వడం దారుణమని, దీనివల్ల కష్టపడి చదువుకున్న అభ్యర్థులు, నిజమైన క్రీడాకారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.?చంద్రబాబు పై ఒత్తిడి పెంచి లోకేష్ మెడలు వంచి నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేస్తాం అని అన్నారు. ప్రభుత్వ తీరుపై నిరుద్యోగుల ఆవేదన ప్రశ్నలు సంధిస్తుంటే ఎందువల్ల లోకేష్ రాజీనామా చేయవు? నీ హయాంలో విద్యాశాఖ లో ఫెయిల్యూర్ జరిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఏవిదంగా ఫెయిల్యూర్ జరిగిందనేటువంటి వాస్తవాలు చెప్తున్నాం. ఆ వాస్తవాలకు నువ్వు సమాధానాలు చెప్పలేకపోతున్నావ్.? లోకేష్ తో బహిరంగ చర్చకు జగన్ మోహన్ రెడ్డి రానక్కర్లేదు మేము అడిగిన ప్రశ్నలకు నువ్వు సమాధానం చెప్పగలిగితే నువ్వు విద్యాశాఖ మంత్రిగా కొనసాగడానికి అర్హుడివే,అనేక సందర్భాలలో అనేకమంది విద్యావేత్తలు గానీ, అక్కడ ఉన్నటువంటి మోసపోయినటువంటి నిరుద్యోగులు గానీ 'అయ్యా మేము బంగారు పతకాలు సాధించాం మాకు మాత్రం ఉద్యోగం రాలేదు' అని క్రీడాకారులు జగన్ మోహన్ రెడ్డి దగ్గర ఆవేదన వ్యక్తం చేశారు అని అన్నారు. అసలు కనీసం క్రీడా మైదానంలో అడుగు పెట్టనటువంటి వాడికి, ఆట చేతకానటువంటి వాడికి, పోటీ పరీక్షలో కూర్చొనటువంటి వాడికి డీఎస్సీలో ఉత్తీర్ణులయ్యారు. దీనికి సంబంధించి చెప్పండి అని న్యాయం కోసం నిరుద్యోగులు గొంతు ఎత్తుతుంటే ప్రభుత్వం అధికారుల చేత ప్రెస్ మీట్లు పెట్టించి, 'నిబంధనల ప్రకారమే చేశాం' అని తప్పుడు సమాధానాలు చెప్పిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి కాకాణి తీవ్రంగా ధ్వజం ఎత్తారు.లోకేష్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, కాకాణి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు ప్రజలను అబద్ధాలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడి కన్నా అబద్ధాలు ఆడటంలో మించిపోయే పిల్లవాడు లోకేష్, చంద్రబాబు నాయుడు ఐదు నిమిషాలకు ఒకసారి కన్ను ఆర్పుతూ అబద్ధం చెప్తే, లోకేష్ అసలు కన్నే ఆర్పకుండా, విరామం లేకుండా అబద్ధాలు చెప్తున్నాడు అని అన్నారు. నిరుద్యోగ భృతి నెలకు 3వేల చొప్పున సంవత్సరానికి 36000 బకాయిలతో కలిపి మొత్తం 1లక్ష 8వేలు నిరుద్యోగులకు బాకీ పడ్డారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి సైనికులం, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలం, ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధపడతాం.ఆంధ్ర రాష్ట్రంలో ఏ రోజు ఎన్నికలు జరిగినా సరే వైయస్సార్సీపి జెండా రెపరెపలాడటం ఖాయం. జగన్మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయం.23 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నారు. కేంద్ర మంత్రి మాత్రం పార్లమెంటులో 6వేల900 కోట్లు మాత్రమే ఆంధ్ర రాష్ట్రానికి పెట్టబడులుగా వచ్చాయని ప్రకటించారు. చంద్రబాబు నాయుడు ఉగాది పండగ రోజు వాలంటీర్లకు పదివేలు పెంచుతున్నట్టు ప్రకటించారు. అనంతరం కొండనాలికకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు వారి ఉద్యోగాలను తీసేశారు అని అన్నారు.రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 25 లక్షల ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, కానీ కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వంలోని మంత్రి పార్లమెంట్‌లో ఇచ్చి సమాధానం ప్రకారం రాష్ట్రానికి వచ్చింది కేవలం రూ.6,900 కోట్లు మాత్రమేనని కాకాణి ఎద్దేవా చేశారు. ఈ పెట్టుబడులతో కేవలం 19 వేల మందికే ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని, మిగిలిన లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలో దాదాపు 4,500 చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడి 50 వేల మంది ఉపాధి కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉగాది రోజున వాలంటీర్ల జీతాన్ని రూ.5,000 నుంచి రూ.10,000 కు పెంచుతామని నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చాక అసలు వాలంటీర్ వ్యవస్థనే రద్దు చేశారని మండిపడ్డారు. చంద్రబాబు మాటలను నమ్మిన వాలంటీర్లు ఇప్పుడు తీవ్రంగా నష్టపోయారని వ్యాఖ్యానించారు. నైతిక విలువలకి కట్టుబడి విద్యాశాఖలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి. డీఎస్సీ లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలి. నిలిచిపోయిన రూ.9,500 కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన నిధులను తక్షణమే విడుదల చేయాలి అని అన్నారు.

**మధుసూదన్ యాదవ్‌కు అండగా ఉంటాం.....** కందుకూరు నియోజకవర్గంలో మాజీ శాసన సభ్యులు మధుసూదన్ యాదవ్ నాయకత్వాన్ని కాకాణి కొనియాడారు. మధు మృదు స్వభావి, సంస్కారం ఉన్న వ్యక్తి అని, కందుకూరు అభివృద్ధికి నిరంతరం తపించే నాయకుడని కొనియాడారు. ఎంతమంది ఎన్ని కుట్రలు చేసినా రాబోయే రోజుల్లో కందుకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని, మధును అసెంబ్లీకి పంపేందుకు పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని స్పష్టం చేశారు.ఆగస్టు 9 నాటికి రిలే నిరాహార దీక్షలు పూర్తవుతాయని, ఆగస్టు 10న నియోజకవర్గ స్థాయిలో భారీ ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని కాకాణి హెచ్చరించారు. కష్టసమయంలో ఎండలను, పోలీసుల ఆంక్షలను లెక్కచేయకుండా తరలివచ్చిన నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియచేసారు. అధ్యక్షత వహించిన బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నైతిక విలువలుంటే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి పెద్దలు చంద్రబాబు నాయుడు లోకేష్ పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను చూసైనా నైతిక విలువలకు కట్టుబడి విద్యాశాఖ మంత్రి చేత రాజీనామా చేయించాలని అన్నారు. కందుకూరు నియోజకవర్గంలో పొగాకు రైతుల సమస్య తీవ్రంగా ఉందని జగన్మోహన్ రెడ్డి రైతులకు అండగా కందుకూరులో పర్యటించనున్నారని ఈ సందర్భంగా తెలిపారు. రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమైన చర్య అని ప్రభుత్వ రంగంలోని కోర్టును నడపాలని భూములు ఇచ్చిన రైతులు ఇల్లు కోల్పోయిన స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రజల పక్షాన ఏపోరాటానికైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గం పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ యువతులు యువకులతో పెట్టుకున్న ఏ పార్టీ బతికి బట్ట కట్టలేదని రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డి పరిపాలన 2.0 కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులకు యువతరానికి ప్రాముఖ్యతనిస్తారని అన్నారు. మొదటిరోజు దీక్ష కార్యక్రమంలో ఎండను సైతం లెక్కచేయకుండా రిలే నిరాహార దీక్షను కొనసాగించారు. దీక్షా శిబిరానికి టెంట్లు వేసుకోవడానికి పోలీసులు ఏమాత్రం అనుమతి ఇవ్వకుండా నిర్బంధాన్ని ప్రయోగించడం సరైనది కాదని హాజరైన వారు మాట్లాడుతున్నారు. మొదటి రోజున విద్యార్థులు యువకులు డీఎస్సీ అభ్యర్థులు దీక్షలో కూర్చున్నవారుకె.అశోకు, కె.మధుసూదన్,సిహెచ్ సురేష్ రవిరాజ్,జంపని అనురాధ కుమార స్వామి, పి.అమరనాథ్ రెడ్డి,తిరుపతి రెడ్డి,జి. శివ, దగ్గు మాటి, కాలేషా,కె.అనీల్ సి.హెచ్ అనీల్,సాయి యన్. మురళీ,టి. ఆదిలక్ష్మి,మద్దసాని. నవీన్ తో పాటుగా పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్, లింగసముద్రం అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు అనుమోలు లక్ష్మీనరసింహం, నాయకులు తోకల కొండయ్య, చీమల వెంకట రాజా, గణేశం గంగిరెడ్డి, అప్పన బోయిన రాజేష్, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, కోవూరు మాజీ సర్పంచ్ ఆవుల మాధవరావు, కట్టా హనుమంతరావు, ముప్పవరపు కిషోర్, బద్దిపూడి జయరావు, వల్లూరి కోటేశ్వరరావు, వెలిచెర్ల ధనకోటి, ఎంపీపీ పులి రమేష్, బిల్లా రమణయ్య, అమ్మనబ్రోలు వెంగళరావు, తల్లపనేని గోపి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు రిలే నిరాహార దీక్షను మాజీ ఏఎంసీ చైర్మన్ తోకల కొండయ్య నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు.

## విద్యార్థులకు 25 వేల రూపాయల రెడీమేడ్ దుస్తులు పంపిణీ





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 06**

మండలంలోని తెట్టు ఎం.పీ.పీ.పాఠశాల (వైసీ)లో విద్యార్థులకు దాత జి.రాజా మహేంద్ర వర్మ రూ:25,000/- ల రెడీమేడ్ దుస్తులను గురువారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిస్వామి అధ్యక్షతన/పర్యవేక్షణలో దాత జి.రాజా మహేంద్ర వర్మ 25 వేల రూపాయల విలువగల రెడీమేడ్ దుస్తులను పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జి.శారదమ్మ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృది కోసం తమ వంతుగా వ్రాత పుస్తకాలు, పెన్సిల్, పెన్ లు, పలకలు తదితర విద్యా సామగ్రిణి పంపిణీ చేస్తూ ఈ సంవత్సరం దుస్తులు పంపిణీ చేయడం జరిగినదని ఆమె తెలిపారు. పిల్లలే మన ఆస్తులు అని వారు డ్రాప్ ఔట్ గా మిగిలిపోకుండా మంచి భవిష్యత్తు కోసం బాగా చదివించాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయించాలని ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి విద్యార్థుల తల్లితండ్రులకు తెలియజేశారు. ప్రభుత్వ పాటశాలల విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న దాతల సేవలు మరువలేనివని, దాత రాజా మహేంద్ర వర్మకు, వారి కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు హరి నారాయణ, యాసిన్ బాష, పాఠశాల కమిటీ చైర్మన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ చెక్కు పంపిణీ

### ముత్తుముల క్రిష్ణ కిశోర్




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన దూదేకుల వనురయ్య కాలు గాయంతో శస్త్రచికిత్స చేయించుకుని వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60,199/- విలువైన చెక్కును గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా క్రిష్ణ కిశోర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించడం అభినందనీయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు కు కూటమి ప్రభుత్వనికి క్రిష్ణ కిశోర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## అమరావతిలో మంత్రులను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

అమరావతి సచివాలయంలో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కలిసి గిద్దలూరు నియోజకవర్గానికి మంజూరైనటువంటి 47 అభివృద్ధి పనులకు 227 కోట్ల రూపాయలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఇంకా అభివృద్ధి, మరమ్మత్తులు చేయవలసిన చెరువులకు నిధులు మంజూరు చేయవలసినదిగా కోరుతూ అర్ధవీడు మండలం లిఫ్ట్ గురించి సంబంధిత టెండర్ విషయాల గురించి , వెలుగొండ ప్రాజెక్టు నందు జరుగుతున్న పనుల గురించి చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తో పాటుగా మంత్రి పొంగూరి నారాయణ, ఎమ్మెల్యే బ్రహ్మ నంద రెడ్డి, కూన రవికుమార్ తో కలిసి పాల్గొన్నామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఫోన్ ద్వారా తెలిపారు.

## అమృతం కన్నా మిన్న తల్లిపాలు

## తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యపరంగా అమృతం




**దొనకొండ ఆగస్టు 6 పెన్ పవర్**

మండలంలోని బాధాపురం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ సి హెచ్ సుభాషిని ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు భాగంగా పాలు ఇచ్చే తల్లులు మరియు గర్భవతులకు సమావేశం జరిగింది ఈ సందర్భంగా సిహెచ్ సుభాషిని మాట్లాడుతూ బిడ్డకు తల్లి జన్మనిచ్చిన గంటలోపు తన ముర్రుపాలను బిడ్డకు పట్టడం మర్చిపోవద్దని అవి అమృతంలాగా రోగనిరోధక శక్తిని కలిగిస్తాయని తల్లులకు గర్భవతులకు వివరించారు. తల్లిపాల లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఈ కారణంగా పిల్లలు తరచూ అనారోగ్య బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడి కార్యకర్త బి. నర్సమ్మ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యపరంగా అమృతంతో సమానమని అందువలన ప్రతి తల్లి కచ్చితంగా పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రు పాలు కచ్చితంగా పట్టించాలని ముర్రుపాలలో ఎక్కువ ప్రోటీన్స్ కొలెస్ట్రాల్ ఉండటం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడమే కాకుండా బిడ్డ శరీరం పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆశా మరియు అంగన్వాడి కార్యకర్త బి కుమారి ఆయా ఎన్ సునీత గర్భవతులు బాలింతలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ను మర్యాదపూర్వక కలిసిన కాకర్ల కృష్ణారెడ్డి

**దొనకొండ ఆగస్టు 6 పెన్ పవర్**

మండల రెవెన్యూ కార్యాలయం నందు నూతనంగా నియమితులైన మండల తహసీల్దార్ ఆర్ కేశవరెడ్డి ను మర్యాదపూర్వకంగా దొనకొండ వైయస్సార్ సిపి మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి శాలువ పూలమాల తో ఘనంగా సత్కరించారు. మండలంలోని ప్రజలకు రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మధ్యవర్తిత్వంతో సమయం.. ఖర్చు ఆదా

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్ - మీడియేషన్ ఫర్ నేషన్ 3.0

### పై అవగాహన కార్యక్రమం, మోటార్ సైకిల్ ర్యాలీ



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 06**

మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగకరమైన విధానమని, మధ్యవర్తిత్వం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల మధ్య సుహృద్భావ సంబంధాలను కొనసాగించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఒంగోలు ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో మీడియేషన్ ఫర్ నేషన్ 3.0 (మధ్యవర్తిత్వం) పై గురువారం అవగాహన, మోటార్ సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థచైర్మన్ ఎ. సత్యానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద్ మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తారీకు నుండి ఏడో తారీఖు వరకు ఇటువంటి కార్యక్రమాలు వివిధ రూపాల్లో ప్రజలకు చేరువు చేయటం జరుగుతుందని తెలిపారు. అనంతరం మోటార్ వెహికల్ ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఒంగోలు చర్చి సెంటర్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించడంతో పాటు న్యాయ అవగాహనను పెంపొందించేందుకు సందేశాన్ని అందించారు. ర్యాలీని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తు టి. రాజ్యలక్ష్మి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రమేష్ బాబు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న నాగిశెట్టి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 6**

రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి నిరంతరం కృషి చేస్తున్నారని జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నాగిశెట్టి చెన్నమ్మ మాలకొండయ్య అన్నారు మండలంలోని వి బైలు గ్రామంలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు గురువారం టిడిపి కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నాగిశెట్టి చెన్నమ్మ మాలకొండయ్య పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేసి వాటిపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు వేగంగా జరుగుతున్నాయని, ప్రజలు



సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి నన్నసాని వరలక్ష్మయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బూత్ కన్వీనర్ కొండమల్లు నారాయణ, మాజీ సర్పంచ్ సారె వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## హజరత్ సానౌల్లా ఖాదర్ స్వామి దర్గాను దర్శించుకున్న బీజేపీ నాయకులు

**అప్పిశెట్టి ఉదయ్ శంకర్**



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 06**

గిద్దలూరు బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ కర్నూలు పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లిహజరత్ సానౌల్లా ఖాదర్ రోజా దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిచారు. ఈ సందర్భంగా దర్గాలో రాష్ట్ర ప్రజల సుఖశాంతులతో, దేశ అభివృద్ధి, మత సామరస్యం, సోదరభావం మెలగాలని కోరుకున్నానన్నారు. భారతదేశం భిన్న మతాలు, భిన్న సంస్కృతులకు నిలయమని, అన్ని మతాలను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. పరస్పర గౌరవం, సోదరభావం, సామాజిక ఐక్యతతోనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అప్పి శెట్టి పేర్కొన్నారు.

## చలో ఢిల్లీ వాల్ పోస్టర్ విడుదల



**వలేటివారిపాలెం , పెన్ పవర్ ఆగస్టు 6**

కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలన నిరసిస్తూ సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక వలేటివారిపాలెంలో సిపిఐ నాయకులు వాల్ పోస్టర్ విడుదల చేశారు . ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు మాట్లాడుతూ బార్లవ్ జరూరి హై మార్పు కావాలి అనే నినాదంతో ఆగస్టు 6 నుండి 15 వరకు గ్రామాలలో పాదయాత్రలు లేదా మైక్ ప్రచారాలు నిర్వహించి, సెప్టెంబర్ 1 న కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలన నిరసిస్తూ చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలు పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, సార్వత్రిక విద్య ఆరోగ్య అందుబాటులోకి తేవాలి, పంటలకు కనీసం మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలి, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునర్ధరించాలి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ,దాడులను నిలిపివేయాలని అనే నిదానంతో సిపిఐ చలో ఢిల్లీ నిర్వహిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఆనంద్ మోహన్, కే మురళి, జి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ జీపుజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్ట్ 6**



నేడు పుల్లలచెరువు మండలంలో జరగనున్న సీపీఐ జీపు జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పుల్లలచెరువు మండల కార్యదర్శి జి.వి.గురునాథం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం జిల్లాను కరువు పీడిత జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు.తక్షణమే పెరిగిన ధరలు తగ్గించాలని సార్వత్రిక విద్య, ఆరోగ్యం అందులో అందుబాటులోకి తేవాలన్నారు. పంటలకు కనీసం మద్దతు ధర కల్పించాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను నిర్వహించాలని, ఇలా అనేక సమస్యలపై సెప్టెంబర్ 1 న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవి కృష్ణ గౌడ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ నియోజకవర్గ కార్యదర్శి బాణాల. రామయ్య తదితరులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.

## కేజీబీవీ ఉపాధ్యాయురాలు టి అనిత గుండెపోటుతో మృతి

**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 6**



మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో హిందీ సీఆర్టిగా గత 11 సంవత్సరాలుగా సేవ లందిస్తున్న టి. అనిత (55) గుండెపోటుతో మృతిచెందడం విద్యాశాఖ వర్గాలు, సహచర ఉపాధ్యాయులను విషాదంలో ముంచెత్తింది. సహచరుల వివరాల మేరకు బుధవారం సాయంత్రం పాఠశాలలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన అనంతరం ఆమెకు ఒక్కసారిగా తీవ్ర గుండెపోటు రావడంతో కుప్పకూలారు. వెంటనే కుటుంబ సభ్యులు సమీప ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో ఆమె తుదిశ్వాస విడిచారు.ఈ విషాద వార్త తెలుసుకున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, ఉపాధ్యాయులు తోట శ్రీనివాసులు, జి. రామకృష్ణ, జె.ఎస్. ఆనంద్, బీటీఏ జిల్లా అధ్యక్షులు లక్కిపోగు ఆంటోనీ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి. అనిత మృతి విద్యా రంగానికి తీరని లోటని, ఆమె సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# ఆరాధన మహోత్సవ వేడుకలకు పోటెత్తిన భక్తులు

## వైభవంగా నారాయణ స్వామి గ్రామోత్సవం

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 6**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ సంప్రదాయ బద్ధంగా శాస్త్రోక్తంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుందర పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా శబ్దాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.గ్రామోత్సవం సందర్భంగా ప్రతి ఇంటి ముందు గ్రామస్తులు హారతులతో స్వామివారికి వారు పోసి మన స్వాగతం పలికారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు ఇచ్చి స్వామివారి ఆశీస్సులు పొందగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని



నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరవశింపజేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తి గీతాలు, కోలాటం, నృత్య ప్రదర్శనలు, ఆధ్యాత్మిక సంగీత విభావరి వంటి కార్యక్రమాలు ప్రేక్షకులను



అలరించాయి. కళాకారుల ప్రదర్శనలు భక్తి భావాన్ని మరింత పెంపొందించేలా ఉండటంతో సభికులు హర్షధ్వానాలతో అభినందించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, సుదూర ప్రాంతాల నుండి వందలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆనందోత్సాహాలతో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన మేడిపండు చందమే

## జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మెడబలిమి వెంకటేశ్వరరావు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్టు 6**



మంగళవారం నాడు ముఖ్యమంత్రి విడుదల చేసిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి నివేదిక మేడిపండు చందమని,పైన పటారం లోన లొటారం అని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మెడబలిమి వెంకటేశ్వరరావు ఎద్దేవా చేశారు.ఆయన గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ నివేదిక మొత్తం ఆత్మ స్తుతి పరనింద తో కూడుకున్నదన్నారు. 2026 మార్చి ఆరవ తేదీన రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టబడిన కాగ్ నివేదిక రాష్ట్ర ఆర్థిక దుస్థితికి అద్దం పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని,రాష్ట్రానికి ఆర్థిక స్థిరత్వం లేదని, రాష్ట్ర భవిష్యత్తు అంధకారమని,భవిష్యత్తులో గడ్డు కాలాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని కాగ్ నివేదికలో స్పష్టం చేయడం జరిగిందని అన్నారు..2024 --25 ఆర్థిక సంవత్సరంలో 365 రోజులకు గాను రాష్ట్రప్రభుత్వం 357 రోజులు రిజర్వ్ బ్యాంక్ దగ్గరికి ఓవర్ డ్రాఫ్ట్, చేబదుల్ల కోసం పోవడం జరిగింది.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో దీన్ని బట్టి తెలుస్తుందని అన్నారు.వైకాపా ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో 3,32,000 కోట్ల రూపాయలు అప్పు చేయగా,కూటమి ప్రభుత్వం కేవలం రెండు సంవత్సరాలలో మూడు లక్షల 56 వేల 655 కోట్ల రూపాయలు అప్పు చేసి రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్ చేసిందని విరుచుకుపడ్డారు.పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక,తమిళనాడుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్,డీజిల్ రేట్లు ఎక్కువగా ఉన్నాయి.నిత్యవసర సరుకుల ధరలు నింగినంటుతున్నాయి.విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 21,273 కోట్ల రూపాయల అదనపు భారము విద్యుత్ వినియోగదారుల మీద మోపిందని అన్నారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆత్మస్తుతి తగ్గించుకొని రాష్ట్ర ప్రగతికి నిర్మాణాత్మక కార్యాచరణ చేపట్టాలని మెడబలిమి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

# ఢాయి ఆఖర్ - జాతీయ లేఖా రచన పోటీలకు ఆహ్వానం

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 06**

భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో "ఢాయి ఆఖర్" జాతీయ లేఖా రచన పోటీలు 2026-27 నిర్వహిస్తున్నట్లు ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ మహ్మద్ జాఫర్ సాదిక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం పోటీ అంశం లెటర్ టు మదర్ ఎర్త్; మై ప్రామిస్ టు ప్రొటెక్ట్ నేచర్ అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించడం, లేఖా రచన కళను ప్రోత్సహించడం, విద్యార్థులు, ప్రజల్లో సృజనాత్మకతను వెలికితీయడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పోటీలలో భారతీయ పౌరులందరూ పాల్గొనవచ్చని, ఈ పోటీలు రెండు వయో విభాగాలలో నిర్వహించబడతాయి అని చెప్పారు.

**18 సంవత్సరాల లోపు**

ఎన్వలప్ విభాగం - ఎ4 సైజు పేపర్ పై గరిష్టంగా 1000 పదాలలో లేఖ రాయాలనీ, ఇన్లాండ్ లెటర్ కార్డ్ (ఐ ఎల్ సి) విభాగం గరిష్టంగా 500 పదాలలో లేఖ రాయాలి అన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు ఎన్వలప్ విభాగం - ఎ4 సైజు పేపర్ పై గరిష్టంగా 1000 పదాలలో లేఖ రాయాలి అన్నారు. లేఖలు తెలుగు, హిందీ, ఆంగ్లం లేదా భారత రాజ్యాంగం గుర్తించిన ఏ భారతీయ భాషలోనైనా స్వహస్తాలతో రాయాలని, టైప్ చేసిన లేదా కంప్యూటర్ ద్వారా ముద్రించిన లేఖలు పరిగణనలోకి తీసుకోబడవని తెలిపారు. ఈ పోటీలలో సర్కిల్ (రాష్ట్ర) స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.25,000/-, రూ.10,000/-, రూ.5,000/-, అలాగే జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.50,000/-, రూ.25,000/-, రూ.10,000/- నగదు బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన వారు తమ లేఖలను 2026 అక్టోబర్ 10వ తేదీ లోగా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, ప్రకాశం డివిజన్, భాగ్యనగర్ 2వ లేన్, ఒంగోలు – 523001 చిరునామాకు పంపించాలని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ మహ్మద్ జాఫర్ సాదిక్ తెలిపారు. ప్రకాశం జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు ప్రజలందరూ ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పోటీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మహ్మద్ జాఫర్ సాదిక్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు సమీప తపాలా కార్యాలయాన్ని లేదా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ కార్యాలయం, ప్రకాశం డివిజన్, ఒంగోలు – 523001ను సంప్రదించవచ్చని తెలిపారు.

# డిఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

## వైసీపీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షులు పల్నాటి రవీంద్ర రెడ్డి

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 06**

డి.ఎస్సీ 2025 నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలనీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షులు పల్నాటి రవీంద్ర రెడ్డి డిమాండ్ చేశారు. డిఎస్సీ -- 2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని, రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేప్పటారు. తొలి రోజు విద్యార్థులు నిరాహార దీక్షలో కూర్చోగా వారికి మద్దతుగా ఒంగోలు వైసీపీ ఇంచార్జి చుండూరి రవి బాబు శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా చుండూరి రవి బాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కుమారుడు విద్యాశాఖ మంత్రి గా ఉన్న నారా లోకేష్ సిబిఐ విచారణ కోరాలని అప్పటి వరకు ఆ శాఖకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో వైసిపి మరింత పోరాటం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షులు కఠారి శంకర్, మాజీ కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ , రాష్ట్ర మహిళా కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ, ఒంగోలు నియోజకవర్గం స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ విగ్నేష్, సాయి చందు, మడతల రవి, భాస్కర్, సిద్ధ రెడ్డి, దేవా, ప్రసన్న పాల్గొన్నారు.

# దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

## - డి ఎస్ పి. రాయపాటి శ్రీనివాసరావు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 06**

ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న వరుస దొంగతనాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయటం జరిగిందని ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు చెప్పారు. నగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలు, అల్లరి మూకల దాడులపై గురువారం డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చీమకుర్తి, మద్దిపాడు, ఒంగోలులో జరిగిన కొన్ని కేసులలో రికవరీ చేయగలిగామని అన్నారు. ఆశ్రమం దగ్గర జరిగిన దొంగతనం పై ప్రత్యేక టీం ఏర్పాటు చేశామని అన్నారు. ఒంగోలు నగరంలో రెండు ఇళ్లల్లో ఒకేరోజు దొంగతనాలు జరగడంపై పోలీస్ శాఖ సీరియస్ గా తీసుకుందని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలను సారం నగరంలో మెన్ పవర్ ను పెంచినట్లు చెప్పారు. ప్రధానంగా ఇంటి యజమానులు, వ్యాపారస్తులు వారి నివాసాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కొంతమేర దొంగతనాలు అరికట్టానికి అవకాశం ఉంటుందని అన్నారు. టెక్నాలజీ పెరిగినప్పటికీ దొంగలు కూడా టెక్నాలజీని అందుపుచ్చుకుంటున్నారని అలాంటి వాటిని అరికట్టేందుకు ప్రధానంగా సీసీ కెమెరాలు ఏర్పాటు ఒక మార్గమని అన్నారు. ఒకటో పట్టణ, తాలూకా పోలీస్ స్టేషన్ లిమిట్స్, సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ లిమిట్స్ లోని రౌడీషీటర్లు కొంత అలజడి సృష్టించారని వారికి ప్రత్యేకంగా కౌన్సిల్ ఇవ్వడం జరిగిందన్నారు. అక్కడక్కడ చిన్నపాటి గొడవలు తప్ప ఎక్కువమంది పాత నేరస్తులు తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారని, ఇంటింటికి వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వటం వలన కూడా కొంత మార్పు వచ్చిందని అన్నారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదని పోలీస్ వ్యవస్థ ఎప్పుడు పటిష్టంగా ఉందని దొంగతనాలు, రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో తాలూకా సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. వెంకటేశ్వర్లు, టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీర నాయక్ పాల్గొన్నారు.

## సంక్రాంతి వెంకట కృష్ణకు పుస్తకాలు అందజేత




**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 06**

ఒంగోలు నగర పాలక సంస్థ 150 సంవత్సరాల వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న పుస్తక ప్రదర్శనకు తమ పుస్తకాలను విశ్రాంత మునిసిపల్ కమిషనర్,150 వసంతాల ఉత్సవాల కమిటీ ప్రత్యేక అధికారి సంక్రాంతి వెంకటకృష్ణ కు నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం సాయంత్రం కలిసి తమ పుస్తకాలను అందజేశారు. పుస్తకాలను అందజేసిన వారిలో కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా నాగభైరవ ఆదినారాయణ, నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, ప్రముఖ కవులు యు.వి.రత్నం, దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి, శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము రాసిన పుస్తకాలను త్వరలో ఒంగోలులో జరిగే పుస్తక ప్రదర్శనలో ప్రదర్శించటానికి అవకాశం కల్పించినందుకు ఉత్సవాల కమిటీ ప్రత్యేక అధికారి సంక్రాంతి వెంకటకృష్ణకు కృతజ్ఞతలు తెలియ జేశారు.

## వెలుగొండ నిర్వాసితులపై కలెక్టర్ సమీక్ష

**పునరావాస పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**




**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 6**

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, పునరావాస ప్రక్రియపై జిల్లా కలెక్టర్ విజయ సునీత బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్వాసితులకు అందాల్సిన పెండింగ్ పరిహారం, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష లో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పాల్గొని నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని,పెండింగ్ పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని,పునరావాస ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని అధికారులను కోరారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసరావు, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, రెవిన్యూ, నీటిపారుదల తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పొదిలి ఏఎస్ఐ మృతదేహాన్ని సందర్శించిన ఎస్సై రాజేష్

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 6**

పొదిలి పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా పని చేస్తూ గుండెపోటుతో మరణించిన కె శ్రీనివాసరావు మృతదేహాన్ని పొదిలి ఎస్ ఐ సూ రెడ్డి రాజేష్ సందర్శించారు. గురువారం నాడు ఏఎస్ఐ శ్రీనివాసరావు స్వగృహానికి వెళ్లి, ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. అలాగే మరణించిన ఏ ఎస్ ఐ శ్రీనివాసరావుకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఏఎస్ఐ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు, మరణించిన ఏ ఎస్ ఐ శ్రీనివాసరావు కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్సై రాజేష్ వారికి భరోసా ఇచ్చారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com